


జడ్పీలో బదిలీలకు రిక్వెస్ట్

కర్నూలు(న్యూసిటీ), ఆగస్టు 27: జిల్లా పరిషత్ పరిధిలోని వివిధ విభాగాలలో పని చేస్తున్న అధికారులు, ఉద్యోగులు 232 మంది ఐదేళ్లు పూర్తి చేసుకున్నారని, వీరిలో 178 మంది బదిలీలకు రిక్వెస్ట్ పెట్టుకున్నట్లు జడ్పీ సీఈఓ జి.నాసరరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీడీఓ-9, పరిపాలన అధికారులు-20, సీనియర్ అసిస్టెంట్లు-35, జూనియర్ అసిస్టెంట్-52, టైపిస్టు-10, రికార్డు అసిస్టెంట్లు-22, లైబ్రరీ అసిస్టెంట్లు-14, ల్యాబ్ అసిస్టెంట్లు-10, నాల్గవ తరగతి ఉద్యోగులు-51, స్వీపర్స్-8, వాచ్‌మెన్-1 ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు.

బదిలీల హడావుడి..!

- నాయకుల చుట్టూ ఉద్యోగులు
- సిఫార్సు లేఖల కోసం పాట్లు

నంద్యాల, ఆగస్టు 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉద్యోగుల బదిలీల హడావుడి జోరందుకుంది. ఐదేళ్లు దాటిన వారిని కచ్చితంగా బదిలీ చేయాల్సిందేనని ప్రభుత్వం చెప్పడంతో ఎవరికి ఎక్కడ పోస్టింగ్ వస్తుందోనని ఉద్యోగులు, అధికారులు ఆందోళన చెందుతున్నారు. తమకు నచ్చిన చోట పోస్టింగు తెచ్చుకునేలా టీడీపీ నాయకులను ప్రసన్నం చేసుకుని వారి నుంచి సిఫార్సు లెటర్ సంపాదించేందుకు నానా పాట్లు పడుతున్నారు. దీని కోసం జిల్లాలోని ముఖ్య నాయకులు చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. గతంలో వైసీపీ నాయకులకు వత్తాసు పలికిన వారే ఈ సారి కూడా తమకు అనుకూలమైన చోట పోస్టింగులు వేయించుకోగలుగుతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. మొన్న జరిగిన తహసీల్దార్ల బదిలీల్లో ఈ విషయం స్పష్టంగా తెలిసిపోయింది. వైసీపీకి అనుకూలంగా పనిచేసి టీడీపీ వారిని ఇబ్బంది పెట్టిన ఉద్యోగులు, అధికారులకు ప్రస్తుతం టీడీపీ వారే సిఫార్సు లేఖలు ఇవ్వటం పలు విమర్శలకు తావిస్తోంది.



ఉద్యోగుల్లో గుబులు

ప్రభుత్వం బదిలీ ఉత్తర్వులు జారీ చేయగానే ముఖ్యంగా రెవెన్యూ, పంచాయతీరాజ్, ఇరిగేషన్, హౌసింగ్ శాఖల్లో ఉద్యోగులు, అధికారులు గుబులు మొదలైంది. ఆయా శాఖల్లోని ఈఈ, డీఈఈ, జేఈ వంటి పోస్టులు ఎక్కువ శాతం ఖాళీగా ఉండటం, లేకుంటే ఆ బాధ్యతలను ఇతరులకు అప్పగించటం వంటి ప్రక్రియ ఇప్పటికే నెలకొంది. ఈ క్రమంలో బదిలీ ఉత్తర్వులు రావటంతో ఆయా స్థానాలకు రెగ్యులర్ ఉద్యోగులు వస్తారా? లేక యథావిధిగా బదిలీల్లోనూ మరొకరికి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగిస్తారా? అనే చర్చ సాగుతోంది. అయితే ఈ బదిలీలు, ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించటంలో కూడా నాయకుల అభీష్టం మేరకే బదిలీలు జరుగుతున్నాయని ప్రచారం జరుగుతోంది. కేసీ కెనాల్‌కు సంబంధించి ఓ అధికారిని బదిలీ విషయంలో కీలక నేత దగ్గరి వ్యక్తికి సంబంధించిన బంధువు ఒకరు రానున్నట్లు తెలుస్తోంది. ఇక విద్యుత్ శాఖలో కూడా ఓ అధికారిని స్థానికంగా మరో చోటుకు బదిలీ చేశారు. ఇక చేరటమే తరువాయి అనే తరుణంలో ఆ అధికారి బదిలీ నిలుపుదల చేసి, తనకు అనుకూలంగా ఉన్న వారిని ఆ సీట్‌లో కూర్చోబెట్టేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది.


అందరి చూపు రెవెన్యూ శాఖపై

ప్రభుత్వ శాఖల్లో రెవెన్యూ శాఖ కీలకమైంది. ఈ శాఖకు సంబంధించి ఇటీవల తహసీల్దార్ల బదిలీలు పూర్తయ్యాయి. ప్రస్తుతం వారి కింది స్థాయి ఉద్యోగుల బదిలీలు జరుగుతున్నాయి. ఈ శాఖలోని ప్రతి అధికారి, ఉద్యోగి గతంలో వైసీపీ నాయకులకు అనుకూలంగా వ్యవహరించిన వారేనన్న ఆరోపణలు అప్పట్లో బలంగా వినిపించాయి. ప్రస్తుతం బదిలీలు మొదలు కావడంతో వీరంతా టీడీపీ నాయకులు చుట్టూ తిరగడం ప్రారంభించారు. గతంలో వైసీపీ కనుసన్నల్లో నడిచిన తహసీల్దార్లకు ఇటీవల జరిగిన బదిలీల్లో వారు కోరుకున్న మండలాల్లో పోస్టింగ్ దక్కడంపై విమర్శలు వెల్లువెత్తాయి. కొంతమంది డిప్యూటీ తహసీల్దార్లకు అసాధారణంగా ఇతర మండలాల్లో అదనపు బాధ్యతలు అప్పజెప్పిన ఘటనలు కూడా ఉన్నాయి. ఈ క్రమంలో విధులను బాధ్యతగా నిర్వహించే వారికి అన్యాయం జరుగుతోందన్న అభిప్రాయం వినపడుతోంది. ఇక దీనికి తోడు ఆయా నాయకులు అనుయాయులు రంగంలోకి దిగి తాము సిఫార్సు లేఖలు ఇప్పిస్తామంటూ బేరసారాలు మొదలుపెట్టారన్న విమర్శలు లేకపోలేదు. దీంతో కొంతమంది నాయకులు అప్రమత్తమయ్యారు. అసలు సిఫార్సు లేఖల కోసం తమ వద్దకు రావాల్సిన అవసరం లేదంటూ బాహాటంగానే చెబుతున్నారు. వెరసి సిఫార్సు లేఖలు తెచ్చుకున్నవారు తమకు అనుకూలమైన చోట పోస్టింగు దక్కించుకుంటుండగా, అలా తెచ్చుకోలేని వారు ఏమవుతుందోనని వేచి చూద్దామనే ధోరణిలో ఉన్నారు.



ఇదే అదనుగా..

ఉద్యోగుల బదిలీల్లో కూటమి నేతల ప్రభావం బాగానే ఉంది. వీరి అనుచరులు అధికారుల వద్ద బేరసారాలకు దిగారు. 'మీకు ఎందుకు మేము ఉన్నాం. అన్నతో లెటర్ ఇప్పించే బాధ్యత మాది' అని సిఫార్సు లేఖల కోసం వచ్చే వారికి హామీ ఇస్తున్నారు. ఉద్యోగులకు బదిలీలను పర్యవేక్షించే కొంతమంది అధికారులు కూడా అందినకాడికి దోచుకుంటున్నట్లు తెలుస్తోంది. ఇదేమిటని ఎవరైనా ప్రశ్నిస్తే 'నాయకులు అడిగినంత ఇస్తారు. మేము అడిగితే ఎందుకు ఇవ్వరు?' అనే ధోరణిలో ప్రవర్తిస్తున్నారు. అక్కడ నాయకులకు, ఇక్కడ వీరికి సమర్పించుకోవాల్సి రావటంతో సిఫార్సు లేఖ ఉన్నా జేబులు నింపాల్సిన పరిస్థితి. మొత్తానికి ఉద్యోగుల బదిలీ పర్వం అటు నాయకులకు, ఇటు సంబంధిత శాఖలో కొందరికి కాసుల పంటగా మారింది.



ఖాళీలపై తర్జన భర్జన

గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగులకు మొదటిసారిగా ఇపుడే సాధారణ బదిలీలు జరుగుతున్నాయి. అయితే ఒకే స్థానంలో ఐదేళ్లు పూర్తి చేసుకుంటే తప్పనిసరిగా బదిలీ కావాలి. ఇలా ఐదేళ్లు పూర్తి చేసుకున్నవారు దాదాపు లేనట్లు తెలుస్తోంది. అంటే ఈ లెక్కన గ్రామ, వార్డు సచివాలయాల్లో దాదాపు ఖాళీలు లేనట్లే! పరిపాలన సహాయకులు, ఏఎన్ఎంలు, వీఆర్ఓ వంటి కీలకమైన ఉద్యోగులకు సంబంధించి కూడా ఖాళీలు లేవని సమాచారం. వీరిలో ఐదేళ్లు పూర్తి చేసుకున్న వారు ఎంతమంది ఉన్నారనేది స్పష్టత లేకపోగా, అసలు ఎక్కడెక్కడ ఖాళీలు ఉన్నాయనే విషయంపై కూడా సంబంధిత శాఖకు స్పష్టత రావటం లేదు. అయినా చాలామంది బదిలీలకు దరఖాస్తు చేసుకున్నారు. రెండు రోజుల్లో జాబితా ప్రకటించి, ఆ తర్వాత బదిలీ ప్రక్రియ పూర్తి చేయనున్నట్లు సమాచారం.

సాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట

ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా



నంద్యాల క్రైం, ఆగస్టు 27: సాంకేతిక పరిజ్ఞానంతో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయాలని ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా మంగళవారం సిబ్బందికి సూచించారు. ఈ మేరకు జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో అసాంఘిక కార్యక్రమాలపై నిఘా ఉంచేందుకు, చట్టవ్యతిరేక కార్యకలాపాలను అడ్డుకునేందుకు విజిబుల్ పోలీసింగ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బంది చురుగ్గా వ్యవహరించాలని ఆదేశించారు. నంద్యాల పట్టణ శివారు ప్రాంతాల్లో, నేరాలు జరిగే ప్రాంతాలను గుర్తించి ఆయా ప్రాంతాల్లో అత్యాధునిక డ్రోన్ కెమెరాలను వినియోగించాలన్నారు. అలాగే బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించే వారిపై, ఇతర అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడేవారి ఆటలను డ్రోన్‌ల సహకారంతో కట్టడి చేయాలని పేర్కొన్నారు. అందులో భాగంగా నంద్యాల తాలుకా పోలీస్ స్టేషన్ పరిధిలోని చెరువుకట్ట చుట్టుపక్కల ప్రాంతాల్లో చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై, బహిరంగంగా మద్యం సేవించే వారిపై కేసులు నమోదు చేసినట్లు వివరించారు. ఇదే విధంగా ప్రతి సబ్ డివిజన్‌కు ఒక డ్రోన్ కెమెరాను కేటాయించడంతోపాటు అసాంఘిక శక్తులు, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడేవారిపై గాలింపు చర్యలు చేపడతామని ఎస్పీ స్పష్టం చేశారు.

అనుమతులు ఉండాల్సిందే



గణేష్ విగ్రహ నిమజ్జన ఉత్సవాల గురించి సమీక్షలో పాల్గొన్న కలెక్టర్, ఎస్పీ, జేసీ, డీఆర్వో

గణేష్ ఉత్సవాలపై కలెక్టర్ సమీక్ష

నంద్యాల (కల్చరల్), ఆగస్టు 27: గణేష్ మండపాల నిర్వహణకు అనుమతులు తప్పనిసరిగా ఉండాల్సిందేనని కలెక్టర్ రాజకుమారి స్పష్టం చేశారు. మరో పది రోజుల్లో జరగబోయే గణేష్ ఉత్సవాల ఏర్పాట్లపై మంగళవారం ఆమె అధికారులతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్‌తో పాటు ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా, జేసీ విష్ణుచరణ్ ఈ సమీక్షలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ సెప్టెంబరు 11న స్థానిక చిన్న చెరువుకట్ట వద్ద ఉన్న వినాయక ఘాట్‌లో గణేష్ నిమజ్జనానికి అవసరమైన ఏర్పాట్లు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. నంద్యాల పట్టణంలో గణేష్ మండపాల ఏర్పాటుకు మున్సిపల్ కమిషనర్, ఏపీఎస్పీడీసీఎల్ కార్యాలయాల నుంచి అనుమతులు తప్పనిసరిగా ఉండాల్సిందేనన్నారు. దాదాపు 500 వినాయక విగ్రహాలు నిమజ్జనం అవుతాయని అధికారులు అంచనా వేశారు. ఈ క్రమంలో స్థానిక చిన్నచెరువు, కేసీ కెనాల్, కుందూనది ప్రాంతాల్లో నిమజ్జన ఏర్పాట్లకు ప్లాట్‌ఫామ్, క్రేన్స్, లైటింగ్, బారికేడింగ్, పుట్టిలతో స్విమ్మర్లు, వైద్యశిబిరాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. గాంధీచౌక్, చిన్నచెరువు సమీపంలో వైద్య శిబిరాలతో పాటు అంబులెన్స్ కూడా సిద్ధంగా ఉంచుకోవాలని డీఎంహెచ్‌ఓను ఆదేశించారు. సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా మాట్లాడుతూ రూట్ మ్యాప్ ప్రకారం గణేష్ విగ్రహాల ఊరేగింపునకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో డీఆర్వో పద్మజ తదితరులు పాల్గొన్నారు.

ఫ్రీ హోల్డ్ భూములను రిజిస్ట్రేషన్ చేయకండి

నంద్యాల (కల్చరల్), ఆగస్టు 27: జిల్లా వ్యాప్తంగా ఫ్రీహోల్డ్ భూములను రిజిస్ట్రేషన్ చేయవద్దని కలెక్టర్ రాజకుమారి సబ్‌రిజిస్ట్రార్లను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో ఫ్రీహోల్డ్ భూముల రిజిస్ట్రేషన్‌పై జేసీ విష్ణుచరణ్‌తో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ నిషేధిత ఆస్తుల జాబితాకు సంబంధించి సెక్షన్ 22-ఏ పరిధిలోకి వచ్చేఅసైన్డ్ భూములు, ప్రభుత్వ ఆస్తులు, దేవాలయ భూములకు సంబంధించి అన్యాక్రాంతం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డీఆర్వో పద్మజ, జిల్లా రిజిస్ట్రార్ చెన్నకేశవరెడ్డి, సబ్ రిజిస్ట్రార్లు తదితరులు పాల్గొన్నారు.

రేపు మల్లన్నకు స్వర్ణ రథోత్సవం



స్వర్ణరథం

శ్రీశైలం, ఆగస్టు 27: శ్రీశైలం మహాక్షేత్రంలో ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకుని భ్రమరాంబ మల్లికార్జున స్వామి అమ్మవార్లకు 29న గురువారం స్వర్ణరథోత్సవం నిర్వహించనున్నారు. దేవస్థానం వైదిక కమిటీ సూచన మేరకు ఆరుద్ర నక్షత్రం సందర్భంగా వేకువజామున స్వామివారికి మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, అన్నాభిషేకం, విశేషపూజలు జరిపి అనంతరం 7:30 గంటలకు ఆలయ వీధుల్లో స్వర్ణరథోత్సవ సేవను నిర్వహించనున్నారు. ఈ మేరకు ఏర్పాట్లను పూర్తి చేసినట్లు ఆలయ అధికారులు తెలిపారు.

మల్లన్న సన్నిధిలో జౌళిశాఖ కమిషనర్



ఆలయ ప్రాంగణంలో కమిషనర్ జి. రేఖారాణి దంపతులు

శ్రీశైలం, ఆగస్టు 27: శ్రీశైలం భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్లను మంగళవారం రాష్ట్ర హ్యాండ్‌లూమ్స్ అండ్ టెక్స్‌టైల్స్ కమిషనర్ జి.రేఖారాణి దంపతులు దర్శించుకున్నారు. దర్శనార్థం ఆలయ రాజగోపురం వద్దకు చేరుకున్న వారికి కార్యనిర్వహణాధికారి డి.పెద్దిరాజు, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం వీరు స్వామివారికి అభిషేకం నిర్వహించుకుని, భ్రమరాంబికాదేవి అమ్మవారికి విశేష అర్చనలు జరిపించుకున్నారు. దర్శనానంతరం అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ఆశీర్వచన మండపంలో వీరికి వేదపండితులు వేదాశీర్వచనం పలికి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ఈ -పంట కీలకం

- 37.61 శాతం మాత్రమే నమోదు
- సెప్టెంబరు 15న ఆఖరు గడువు
- నిర్ణీత గడువులోగా వందశాతం పూర్తి చేస్తాం: విజయశేఖర్, ఏడీఏ నందికొట్కూరు



మిడ్తూరు మండల కేంద్రంలో ఈ-పంట నమోదు చేస్తున్న వ్యవసాయ అధికారి పీరునాయక్

నందికొట్కూరు, ఆగస్టు 27: వ్యవసాయ రంగంలో ఈ పంట నమోదు కీలకం. రైతన్నలకు ప్రకృతి వైపరీత్యాలు ఎదురైనప్పుడు ఆదుకోవాలన్నా, పండించి పంటను ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించాలన్నా, మద్దతు ధర లభించాలన్నా ఈ-పంట సమాచారం తప్పని సరి. ఈ నేపథ్యంలో కర్షకులు కూడా తాము సాగు చేసిన పంటలను వ్యవసాయ, ఉద్యానాధికారుల వద్ద నమోదు చేయించడంలో అప్రమత్తంగా ఉండాలి. ఏ మాత్రం నిర్లక్ష్యం చేసినా పైన చెప్పిన ప్రయోజనాలకు దూరమవుతారు. 2024-25ఖరీఫ్ సీజన్‌కు సంబంధించిన రైతులు సాగు చేసిన పంటల సమాచారాన్ని వీఏఏలు, వీహెచ్ఏలు సెప్టెంబరు 15 నాటికి నమోదు ప్రక్రియ పూర్తి చేయాలి. ఇప్పటి వరకు 37.61 శాతం మాత్రమే ఈ పంట నమోదు చేశారు. గడువు మీరితే యాప్‌లో సమాచారం స్వీకరించక సాగుదారులు నష్టపోయే ప్రమాదం ఉంది. ఈ-పంట నమోదుకు కౌలు రైతులు పంట సాగు హక్కు పత్రాలు వీఆర్వో నుంచి తీసుకోవాల్సి ఉంది.

2024-25 ఖరీఫ్ సీజన్ పంటల్లో ఈ-పంట నమోదైన విస్తీర్ణం ..

ఎకరాల్లో ఇలా

మండలం	సాగైనది ఎకరాల్లో	ఈ-పంట నమోదు ఎకరాల్లో
నందికొట్కూరు	15,340	5,687
పగిడ్యాల	5,855	3,303
మిడ్తూరు	18,257	5,317
జూపాడుబంగ్లా	15,600	6,400
మొత్తం	**55,052**	**20,707**

- దృష్టి సారించాలి: నియోజకవర్గంలో మిడ్తూరు, నందికొట్కూరు, పగిడ్యాల, జూపాడుబంగ్లా మండలాల్లో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో నాలుగు మండలాల్లో 55,052 ఎకరాల్లో మొక్కజొన్న, ఉల్లి, పత్తి, కంది, మినుము, పెసర పంటలను సాగు చేశారు. మిరప, వరి, పొగాకు పంటల సాగు మరో పక్షం రోజుల్లో పూర్తి అవుతుంది. దీంతో సాగు విస్తీర్ణం ఇంకా పెరిగే అవకాశం ఉంది. గడువు సమీపిస్తున్న నేపథ్యంలో లక్ష్యం మేరకు ఈ పంట నమోదుపై రైతులు, అధికారులు దృష్టి సారించాల్సి ఉంది.

ఈ కేవైసీ కూడా నమోదు చేయాలి



ఖరీఫ్ సీజన్‌లో రైతులు సాగు చేసిన పంటలకు సంబంధించి ఈ -పంట నమోదు ప్రక్రియను నిర్దేశిత గడువులోపు పూర్తి చేస్తాం. వీఏఏలు, వీహెచ్ఏలు ఈ పంట నమోదును వేగంగా పూర్తి చేసేందుకు ఆదేశాలు జారీ చేశాం. రైతులు కూడా ఈ-పంటతో పాటు ఈకేవైసీ కూడా నమోదు చేయించాలి. కౌలు రైతులు సీసీఆర్‌సీ తప్పనిసరిగా వీఆర్వో నుంచి తీసుకొని ఈ పంట నమోదు చేయించుకోవాలి.

- విజయశేఖర్, ఏడీఏ, నందికొట్కూరు

కోట్ల కృష్ణుడు..!



ఆయనో మాజీ సీఎం కుమారుడు, మాజీ కేంద్రమంత్రిగా ఢిల్లీలో చక్రం తిప్పిన నేత.. రాజకీయ అనుభవం ఉన్న నాయకుడు. ఆయనే ప్రస్తుత డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్ రెడ్డి. సీరియస్‌గా కనిపించే ఆయన రాజకీయంగా మాత్రం మృదుస్వభావి. మంగళవారం కృష్ణాష్టమి వేడుకల్లో ఒక్కసారిగా ఆయన గెటప్ మారింది. సీరియస్ నేత కాస్తా బాలకృష్ణుడిలా మారారు. తలపై నెమలి పింఛం కలిగిన కిరీటం.. చేతిలో పిల్లనగ్రోవితో దర్శనమిచ్చిన ఆయనను డోన్ ప్రజలు ఆసక్తిగా చూశారు. మంగళవారం డోన్ పట్టణంలో జరిగిన శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్ రెడ్డి ఇలా శ్రీకృష్ణుడి వేషధారణలో పిల్లనగ్రోవితో వాయిస్తూ సరదాగా కనిపించారు.

- డోన్

మఠం హుండీ ఆదాయం
రూ.3.23 కోట్లు



హుండీని లెక్కిస్తున్న భక్తులు

మంత్రాలయం, ఆగస్టు 27: మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మఠం హుండీ ఆదాయం రూ.3,23,44,480 నగదు వచ్చినట్లు మఠం ఏఏఓ మాధవశెట్టి, మేనేజర్లు ఎస్కే శ్రీనివాస రావు, వెంకటేష్ జోషి తెలిపారు. మంగళవారం జూలై 2 రోజులతో పాటు ఆగస్టు 27 రోజులకు సంబంధించిన 29 రోజుల హుండీని మఠం గురురాజాంగణ భవనంలో దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో కట్టుదిట్టమైన భద్రత, సీసీ కెమెరాల నిఘా మధ్య లెక్కించినట్లు తెలిపారు. రూ.3,23,44,480 నగదుతో పాటు 1.273 కిలోల వెండి, 156 గ్రాములు బంగారు, వివిధ దేశాల డాలర్లు వచ్చినట్లు చెప్పారు.

జగన్‌ను తక్షణమే అరెస్టు చేయాలి
- టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి



కర్నూలు(అర్బన్), ఆగస్టు 27: రూ. లక్షల కోట్లు దోచేసి బెయిల్‌పై బయట ఉన్న జగన్‌ను తక్షణమే అరెస్టు చేసి జైలుకు పంపాలని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలో తండ్రి అధికారాన్ని అడ్డుపెట్టుకొని రాష్ట్రాన్ని సమూలంగా దోచుకుని సీబీఐ కేసుల్లో అరెస్టు అయిన జగన్ బెయిల్‌పై తిరుగుతున్నాడని, వెంటనే సీబీఐ స్పందించాలని విజ్ఞప్తి చేశారు. ఇలాంటి ఆర్థిక ఉగ్రవాది ప్రజల మధ్యలో ఉంటే మరింత ప్రమాదం జరిగే అవకాశం ఉందన్నారు. రాష్ట్రాభివృద్ధి కోసం తీరిక లేకుండా కష్టపడుతున్న చంద్రబాబుపై దుష్ప్రచారం చేస్తే సహించేది లేదని హెచ్చరించారు.

ఉరుకుంద హుండీ ఆదాయం రూ.1.6 కోట్లు



హుండీ లెక్కింపులో పాల్గొన్న సిబ్బంది

కౌతాళం ఆగస్టు 27: మండలంలో ఉరుకుంద ఈరన్న స్వామి దేవస్థానంలో శ్రావణ మాసపు ఉత్సవాల సందర్భంగా నాలుగో సోమవారం భక్తులు సమర్పించిన కానుకలను దేవస్థానపు కాలక్షేపపు మండపంలో మంగళవారం హుండీ లెక్కింపు కార్యక్రమం చేపట్టారు. స్వామి వారి హుండీ లెక్కింపు కార్యక్రమం ఆలయ డిప్యూటీ కమిషనర్ గురుప్రసాద్ ఆధ్వర్యంలో మంగళవారం కొనసాగినది. నగదు రూపంలో రూ.1,00,09,030, అన్నదానం హుండీ రూ.6,68,500 మొత్తం నగదు రూ.1,06,77,530, బంగారం 8గ్రాములు, వెండి 22 కిలోల 400గ్రాములు వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉత్సవాల అధికారి పాండురంగారెడ్డి, హుండీ పర్యవేక్షణ అధికారి వెంకటేశ్, ఏపీజీబీ బ్యాంకు సిబ్బంది, ఆలయ అర్చక సిబ్బంది, దేవస్థానపు సిబ్బంది పాల్గొన్నారు.

కిమ్స్ హాస్పిటల్‌కు ఎన్టీఆర్ వైద్యసేవ నోటీసులు

- రోగి నుంచి ఎలా డబ్బులు చేస్తారు..?
- జిల్లా కో ఆర్డినేటర్ డా. భాస్కర్ రెడ్డి



విచారణ చేస్తున్న ఎన్టీఆర్ వైద్యసేవ జిల్లా కోఆర్డినేటర్

కర్నూలు(హాస్పిటల్), ఆగస్టు 27: కిమ్స్‌లో వైద్యం పేరుతో రూ.4 లక్షలు వసూలు చేసి కూడా సరిగా వైద్యం చేయకపోవడతో బాలిక చనిపోయిందనే వార్తకు డా. ఎన్టీఆర్ వైద్యసేవ జిల్లా కో ఆర్డినేటర్ డా.భాస్కర్ రెడ్డి స్పందించి నోటీసులు ఇచ్చారు. మంగళవారం ఆయన కిమ్స్ హాస్పిటల్‌కు వెళ్లి తనిఖీ చేశారు. డా.ఎన్టీఆర్ వైద్యసేవ కార్డు ఉన్న బాలికకు దాని కింద ఎందుకు చికిత్స అందించలేదని, కిమ్స్ హాస్పిటల్ వైద్యులను ప్రశ్నించారు. డెంగీ వ్యాధి ఎన్టీఆర్ వైద్యసేవ కింద ఉన్నా ఎందుకు రోగి తల్లిదండ్రుల నుంచి డబ్బులు వసూలు చేశారని మండిపడ్డారు. జరిగిన ఘటనపై డా. భాస్కర్ రెడ్డి కిమ్స్ హాస్పిటల్‌లో విచారణ చేశారు. చనిపోయిన బాలిక కావేరీ కేషీట్‌ను ఆయన స్వాధీనం చేసుకు న్నారు. ఈ విషయాన్ని డా.ఎన్టీఆర్ వైద్యసేవ ట్రస్టు అధికారులకు తెలియజేసి కిమ్స్ హాస్పిటల్ సీఈవోకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. 24 గంటల్లో ఈ కేసుకు సంబంధించిన వివరాలు అందజేయాలని అందులో పేర్కొన్నారు.

ఇసుక ప్రతి కుటుంబానికి చేరాలి

వీఆర్‌వోలకు బుకింగ్ విధానం అవగాహన



వీఆర్‌వోలకు అవగాహన కల్పిస్తున్న గనుల శాఖ డీడీ

కర్నూలు(అర్బన్), ఆగస్టు 27: ఇసుక అవసరమైన ప్రతి కుటుంబానికి అందించాలనేది ప్రభుత్వ లక్ష్యమని గనుల శాఖ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్ అన్నారు. మంగళవారం నగరంలోని గనుల శాఖ కార్యాలయంలో వీఆర్‌వోలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బుకింగ్ చేసుకున్న ప్రతి ఒక్కరికి ఇసుక సరఫరా చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు వెళ్తున్నదని, అందుకు వీఆర్‌వోలు తమ వంతు బాధ్యతతో పని చేయాలని సూచించారు. కర్నూలు గనుల శాఖ, కార్యాలయంలో తోపాటు సీ బెళగళ్ మండలంలో ఏర్పాటు చేసిన కేంద్రాల నుంచి మాత్రమే బుకింగ్ చేసుకోవాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా 3.87 లక్షల టన్నుల ఇసుక సిద్ధంగా ఉందని, టన్ను ఇసుక రూ. 326 ధర నిర్ణయించారని తెలిపారు.

మంత్రాలయంలో ఉత్సాహంగా ఉట్టి వేడుకలు



మధ్వమార్గ్ కారిడార్‌లో ఉట్టి కొడుతున్న సంస్కృత పాఠశాల విద్యార్థులు

మంత్రాలయం, ఆగస్టు 27: మంత్రాలయం శ్రీరాఘవేంద్రస్వామి మఠం మధ్వమార్గ్ కారిడార్‌లో శ్రీకృష్ణాష్టమి వేడుకలను పురస్కరించుకుని మంగళవారం ఉట్టి కొట్టే కార్యక్రమాలను ఘనంగా జరుపుకున్నారు. మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు, వ్యాసరాజమఠం విద్యామనోహర తీర్థులు, బాలాఘర్ మఠం అక్షోభ్యరామప్రియతీర్థులు ఉట్టి వేడుకలను వీక్షించారు. భక్తి శ్రద్ధలతో రంగు నీళ్లు చల్లుకుంటూ గురుసార్వభౌమ సంస్కృత పాఠశాల విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించి ఉట్టి కొట్టారు. విద్యార్థులకు శ్రీమఠాల పీఠాధిపతులు ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రమణారావు, మేనేజర్ ఎస్‌కే శ్రీనివాసరావు వెంకటేశ్ జోషి, ఐపీ నరసింహమూర్తి పాల్గొన్నారు.

2న పారా మెడికల్ కోర్సులకు కౌన్సెలింగ్

కర్నూలు(హాస్పిటల్), ఆగస్టు 27: కర్నూలు మెడికల్ కాలేజీలో పారా మెడికల్ కోర్సులు 2024-25 సంవత్సరానికి అడ్మిషన్ల కోసం దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు సెప్టెంబరు 2న ఉదయం 10 గంటలకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డా. హరిచరణ్ ఒక ప్రకటనలో తెలిపారు. కౌన్సెలింగ్ కర్నూలు మెడికల్ కాలేజీ ఆడిటోరియంలో కౌన్సిలింగ్ ఉంటుందని, కౌన్సిలింగ్‌కు అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లను తీసుకురావాలని, ఇంటర్ బైపీపీ విద్యార్థులకు మొదట ప్రాధాన్యత ఉంటుందన్నారు. మార్కులు, రోస్టర్ ఆధారంగా అర్హులైన వారికి సీట్లు కేటాయించబడుతాయని ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ తెలిపారు.

కుందూ నదిలో గుర్తు తెలియని శవం

దొర్నిపాడు, ఆగస్టు 27: మండలంలోని క్రిష్టిపాడు గ్రామ శివారులో కుందూనదిలో గుర్తు తెలియని శవం లభ్యమైనట్లు ఏఎస్‌ఐ రంగయ్య తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ కుందూనదిలో దాదాపు 45 ఏళ్ల వయసు గల మహిళ శవం కొట్టుక రావడంతో వీఆర్వో సాంబశివరావు ఫిర్యాదు చేశారని తెలిపారు. శవానికి తల వెంట్రుకలు పూర్తిగా వెంట్రుకలు లేవని అన్నారు. వారం రోజుల కిందట మృతి చెంది ఉండవచ్చని ఏఎస్‌ఐ వెల్లడించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

నేషనల్ ఇన్సూరెన్స్ కంపెనీకి కమిషనర్ లేఖ

కర్నూలు(న్యూసిటీ), ఆగస్టు 27: నగర పాలక సంస్థ పరిధిలో 15 వాహనాలకు ఇన్సూరెన్స్ రూ.3లక్షలు ఎక్కువ కట్టామని కమిషనర్ పీవీ రామలింగేశ్వర్ నేషనల్ ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్ మేనేజర్‌కు లేఖ రాశాడు. 15 వాహనాలకు రూ.4 లక్షలు కట్టాల్సి ఉండగా.. రూ.7 లక్షలు కట్టారని, రూ.3 లక్షలు తిరిగి ఇవ్వాలని కోరుతూ ఇన్సూరెన్స్ కంపెనీకి లేఖను పంపారు.

- సెప్టెంబరు 24న లోకాయుక్తలో హాజరు కావాలి: నగర పాలక సంస్థకు సంబంధించి లెటర్.నెంబర్.2310/2023/బి1/లోక్/3977/2024 తేదీ-06.04.2024 సంబంధించి నగర పాలక సంస్థ కమిషనర్ సెప్టెంబరు 24న లోకాయుక్తలో హాజరు కావాలని జడ్జీ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు లోకాయుక్త నుంచి సమన్లు రావడంతో కమిషనర్ దానికి సంబంధించిన వివరాలను సేకరించి ప్రతిపాదనలు పంపాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

వ్యక్తి ఆత్మహత్య

బనగానపల్లె, ఆగస్టు 27: బనగానపల్లె మండలం నందివర్గం పోలీస్‌స్టేషన్ పరిధిలోని నందివర్గం గ్రామానికి చెందిన ఉగ్గు దస్తగిరి కుమారుడు సంజీవరాయుడు (32) జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్‌ఐ వెంకటసుబ్బయ్య మంగళవారం తెలిపారు. గతంలో సంజీవరాయుడు ప్రమాదానికి గురైనరాల బలహీనతకు గురయ్యారు. దీనికితోడు మానసిక స్థితి సరిగా మనస్తాపానికి గురై ఇంట్లోనే పురుగుల మందు తాగి మృతి చెందినట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతుని తండ్రి దస్తగిరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

పొలాల్లోకి మురుగు

- గ్రామంలోని డ్రైనేజీ నీరంతా పంటల్లోకి
- 20 ఏళ్లుగా రైతుల ఆందోళన.. ఫిర్యాదులు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు



లొద్దిపల్లె గ్రామంలో ప్రవహించే ప్రధాన మురికి కాలువ

కర్నూలు, ఆగస్టు 27 (ఆంధ్రజ్యోతి): ఓర్వకల్లు మండలం లొద్దిపల్లె గ్రామంలో జనాభా 4 వేలు పైమాటే. ఆ గ్రామంలోని మురుగునీరు వెళ్లేందుకు ప్రధాన డ్రైనేజీ లేదు. ఊళ్లో మురుగంతా సమీప పొలాల్లోకి వదిలేస్తున్నారు. ఒక రోజు కాదు.. రెండు రోజులు కాదు. దాదాపుగా 20 ఏళ్లుగా పల్లెలోని డ్రైనేజీల నీరంతా పంట పొలాల్లోకి వదలడంతో సాగు చేసుకోలేని దుర్భర పరిస్థితి అని రైతులు అంటున్నారు. మురుగునీరంతా పొలాల్లోకి చేరడంతో టీచర్ వెంకట్రామిరెడ్డి, కమ్మ తిమ్మారెడ్డి, సుదర్శన్‌బాబు, డ్రైవర్ వెంకటేశ్వర్లు, కమ్మ రాజశేఖర్, చంద్రశేఖర్, కురువ పెద్దయ్య, టైమూరు బాషా, పెద్దబాషా, ఎస్.చందు తదితర రైతుల 30 ఏకరాలకు పైగా పొలాలు మురుగునీరు పంట సాగుకు పనికి రాకుండా పాడైపోతున్నాయని వాపోతున్నారు. డ్రైనేజీకి అడ్డుకట్ట వేస్తే గ్రామంలోని వీధుల్లో మురుగునీరు చేరిపోయి వ్యాధులు ప్రబలే అవకాశం ఉండడంతో మానవత్వంతో ఆ పని చేయడం లేదని రైతు కమ్మ రాజశేఖర్ వివరించారు. గత వైసీపీ ప్రభుత్వంలో కలెక్టరు, వ్యవసాయ అధికారులు, మండల అధికారులకు ఫిర్యాదులు చేస్తే.. క్షేత్రస్థాయిలో పరిశీలించి మురుగునీటి రైతులు నష్టపోతున్న మాట నిజమే అని, 400 మీటర్లు పక్కా డ్రైనేజీ నిర్మిస్తే సమస్య పరిష్కారమవుతుందని తేలింది. దీనికి రూ.13.50 లక్షలకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఆ ప్రతిపాదనలు రూ.20, 30 లక్షలకు చేరిందే తప్ప నిధులు ఇవ్వలేదు. పనులు చేపట్టలేదు. రైతులకు మాత్రం కన్నీళ్లు తప్పడం లేదు. ఇప్పటికైనా అధికారులు, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత తమ గోడు ఆలకించి పక్కా డ్రైనేజీ నిర్మించి పొలాలను కాపాడాలని విన్నవిస్తున్నారు.



పంట పొలాల మధ్య ప్రవహించే ప్రధాన మురికి కాలువ

మా గోడు పట్టించుకోవడం లేదు



మా ఊరిలోని మురుగంతా పొలాల్లోకి వస్తున్నది. అడ్డుకట్ట వేస్తే ఊరంతా మురుగు చేరి వ్యాధులు ప్రబలుతాయి. అందుకని ఆ పని చేయడం లేదు. 20 ఏళ్లుగా ఇబ్బందులు పడుతున్నాం. గత వైసీపీ ప్రభుత్వంలో అధికారులకు ఫిర్యాదులు చేస్తే పరిశీలించి పక్కా అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులకు రూ.13.50 లక్షలతో అంచనా వేశారు. నిధులు మాత్రం ఇవ్వలేదు. ఇప్పుడు రూ.30 లక్షలకు చేరింది. గత వైసీపీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి దృష్టికి తీసుకెళితే న్యాయం చేస్తానని చెప్పాడే తప్ప పట్టించుకోలేదు. - కమ్మ రాజశేఖర్, రైతు, లొద్దిపల్లె, ఓర్వకల్లు మండలం


మురుగంతా పొలాల్లోకే



వర్షపు నీరు పొలాల్లోకి వెళ్తుందంటే ఎవరూ అభ్యంతరం చెప్పరు. గ్రామంలోని మురుగునీరంతా పంట పొలాల్లోకి వదిలేశారు. చేలు పాడైపోతున్నాయి. రైతు గోడు రాజకీయ నాయకులు పట్టించుకోవడం లేదు.

- తైమూర్ బాష, లొద్దిపల్లె గ్రామం

పంట సాగు చేయలేని పరిస్థితి



మా గ్రామం పక్కనే నాకు 6.30 ఎకరాలు పొలం ఉంది. ఊర్లోని మురుగునీరంతా మా పొలాల్లోకి వస్తుంది. పంటలు సాగు చేయలేని పరిస్థితి ఏర్పడింది. కౌలుకు ఇద్దామన్నా ఎవరూ ముందుకు రావడం లేదు. ప్రధాన రోడ్డు పక్కనే 400 మీటర్ల వరకు పక్కా డ్రైనేజీ నిర్మిస్తే మా కష్టాలు తీరుతాయి.

- సి. చంద్రశేఖర్, లొద్దిపల్లె గ్రామం

అధికారులనే ఏమార్చిన ఘనుడు..!

- తప్పుడు వివరాలతో ఎస్టీ కుల ధ్రువీకరణ పత్రం
- విచారణ చేయకుండానే మంజూరు చేసిన అధికారులు
- తప్పు తెలుసుకుని.. చర్యలకు ఆదేశం

కౌతాళం, ఆగస్టు 27: ఏదైనా ధ్రువీకరణ పత్రం పొందాలంటే అధికారుల చుట్టూ కాళ్లు అరిగేలా తిరిగినా పనికావడం కష్టం. కానీ కౌతాళం తహసీల్దార్ కార్యాలయంలో అధికారులు ఎలాంటి విచారణ చేపట్టకుండా కుల ధ్రువీకరణ పత్రం మంజూరు చేశారు. ఆ తర్వాత తమ తప్పులు తెలుసుకుని అధికారులు అప్రమత్తమై మంజూరు చేసిన పత్రాన్ని తిరిగి స్వాధీనం చేసుకుని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. తహసీల్దార్ మల్లికార్జున స్వామి తెలిపిన వివరాల మేరకు కర్నూలుకు చెందిన నల్లగోడి శ్రీనివాసులు తప్పుడు ఎస్టీ కుల ధ్రువీకరణ పత్రంతో ప్రభుత్వ ఉపాధ్యాయ ఉద్యోగం పొందాడు. శ్రీనివాసులు తప్పుడు కుల ధ్రువీకరణ పత్రంతో ఉద్యోగం పొందాడని జిల్లా అధికారులకు కొందరు ఫిర్యాదు చేయడంతో అతడిని విధుల నుంచి సస్పెండ్ చేశారు. రెండు నెలల్లో అసలైన కుల ధ్రువీకరణ పత్రం సమర్పించాలని గడువు ఇచ్చారు. దీంతో ఎలాగైనా ప్రభుత్వ ఉద్యోగం తిరిగి పొందాలన్న ఆలోచనతో తన ఆధార్ కార్డులో మండల పరిధిలోని బదినేహల్ గ్రామ వాసిగా తప్పుడు కార్డును సృష్టించి దాని ఆధారంగా కౌతాళం తహసీల్దార్ కార్యాలయంలో ఎస్టీ సర్టిఫికెట్ కోసం దరఖాస్తు చేసుకున్నాడు. సదరు దరఖాస్తును గ్రామ వీఆర్వో సూర్యనారాయణ రెడ్డి విచారించకుండా సంతకం చేసి తహసీల్దార్‌కు పంపించాడు. వీఆర్వో సంతకంతో తహసీల్దార్ కూడా శ్రీనివాసులుకు ఎరుకలి కులం సర్టిఫికెట్‌ను మంజూరు చేశాడు. ఎస్టీ సర్టిఫికెట్‌ను శ్రీనివాసులు మరో రెండు రోజుల్లో ఉన్నతాధికారులకు సమర్పించాల్సి ఉండగా అనుమానం వచ్చిన వీఆర్వో, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సదరు వ్యక్తిపై గ్రామంలో విచారించగా అలాంటి పేరు గల వ్యక్తి ఆ గ్రామంలో లేడని తెలిసింది. రెవెన్యూ అధికారులు వెంటనే శ్రీనివాసులును ఫోన్‌లో సంప్రదించి తమ వద్దకు రప్పించుకుని అతను పొందిన కుల ధ్రువీకరణ పత్రాన్ని స్వాధీనం చేసుకుని ఆధార్‌కార్డును ఎలా సృష్టించావని ఆరా తీశారు. దీంతో ఆయన తాను చేసిన మోసం ఒప్పుకుని అధికారులను క్షమించమని ప్రాధేయపడ్డాడు. ఈ విషయంపై తహసీల్దార్ మల్లికార్జున స్వామిని వివరణ కోరగా.. శ్రీనివాసులు తప్పుడు ఆధార్‌కార్డు చిరునామాతో అధికారుల నుంచి కుల ధ్రువీకరణ పత్రం పొందాడని, దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేశామని అన్నాడు. అదేవిధంగా విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన గ్రామ వీఆర్వోపై కలెక్టర్‌కు నివేదిక పంపుతానని తెలిపారు.



కౌతాళం తహసీల్దార్ కార్యాలయం

దేవుడి ఆస్తులను కబ్జా చేస్తారా...?

- ఉమ్మడి జిల్లాలో కబ్జాలపై విచారణ ఆరంభం
- కబ్జారాయుళ్లకు కాటసాని ప్రిన్సిపాల్
- సజ్జల అండతో రెచ్చిపోయి దోచేశారు
- మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖరరెడ్డి ఫైర్



కర్నూలు(అర్బన్), ఆగస్టు 27: వైసీపీ పాలనలో ఉమ్మడి కర్నూలు జిల్లాలో సజ్జల అండతో కబ్జా రాయుళ్లు వైసీపీ నేత కాటసాని రాంభూపాల్‌రెడ్డి డైరెక్షన్‌లో రూ.కోట్లు విలువ చేసే వేలాది ఎకరాల భూములు కబ్జా చేశారని మాజీ ఎమ్మెల్యే, టీడీపీ సీనియర్ నాయకుడు బైరెడ్డి రాజశేఖరరెడ్డి ఆరోపించారు. మంగళవారం నగరంలోని ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ సమీపంలోని బైరెడ్డి కాంప్లెక్స్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేవుడి భూములు దేవుడికే దక్కేలా పోరాటం చేస్తామన్నారు. అమెరికాలో నివసిస్తున్న వ్యక్తి కర్నూలు మండలం పసుపల గ్రామంలోని సర్వే నెంబర్ 608-2 వీరభద్ర స్వామి ఆలయ మాన్యం భూమికి ఎన్‌వోసీ కావాలని దరఖాస్తు చేసుకున్నాడంటే కబ్జాలు ఎంత వరకు చేరాయో అర్థం చేసుకోవచ్చని అన్నారు. ఉమ్మడి జిల్లాలో కబ్జా రాయుళ్లకు మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి ప్రిన్సిపాల్‌గా వ్యవహిస్తూ పెంచి పోషించాడని, అనుచరులంతా బిల్డర్ల అవతారం ఎత్తి దేవుడి భూములు, వక్ఫ్ భూములు, అటవీ భూములు, వాగులు, వంకలు, పోరంబోకు స్థలాలన్నీ కబ్జా చేశారని ఆరోపించారు. అంతేగాక వాటన్నిటికీ రికార్డులు కూడా తయారు చేయించారని, వాటిని తయారు చేసిన రెవిన్యూ, రిజిస్ట్రేషన్ అధికారులను కూడా సస్పెండ్ చేయాలని కోరారు. కాటసాని అనుచరులు నగర శివారులోని జగనాథ గట్టుపై ఉన్న ఆలయానికి చెందిన 79 ఎకరాల భూమిని కబ్జా చేశారనే ఫిర్యాదు రావడంతో ఎంపీ బైరెడ్డి శబరి వెళ్లి వెంటనే పరిశీలించారని, ఆ విషయాన్నిసీఎంకు కూడా ఫిర్యాదు చేశారని అన్నారు.

ఆగిన లారీని ఢీకొన్న మరో లారీ

డ్రైవర్‌కు గాయాలు

చాగలమర్రి, ఆగస్టు 27: చాగలమర్రి గ్రామ సమీపంలోని 40వ జాతీయ రహదారిపై కూలూరు రస్తాలో ఆగిన వాటర్ ట్యాంకర్‌ను ఐచర్ వాహనం ఢీకొన్న సంఘటనలో డ్రైవర్ గాయపడ్డాడు. జాతీయ రహదారిపై డివైడర్ మధ్యలో ఉన్న మొక్కలకు హైవే వాటర్ ట్యాంకర్ నీరు పడుతుండగా హైదరాబాదు నుంచి తిరుపతి వెళ్తున్న సింధూ పార్శిల్ సర్వీస్ ఐచర్ వాహనం వాటర్ ట్యాంకుకు వెనుక వైపు ఢీకొట్టింది. దీంతో డ్రైవర్ రఫిద్దిన్ గాయపడ్డాడు. హైవే అంబులెన్స్ సిబ్బం ది సంఘటన స్థలానికి చేరుకొని గాయపడిన రఫిద్దిన్‌ను చికిత్స నిమి త్తం ప్రొద్దుటూరు వైద్యశాలకు తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం కర్నూలు వైద్యశాలకు తరలించారు. ఈ విష యం తెలుసుకున్న ఏఎస్‌ఐ నబీసాహెబ్ సంఘటన స్థలానికి చేరుకొని ఢీకొన్న లారీలను పరిశీలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కిరాణాషాపులో చోరీ

కోవెలకుంట్ల, ఆగస్టు 27: కోవెలకుంట్ల పట్టణంలోని పాండురంగ స్వామి దేవాలయం పక్కనే ఉన్న షాపింగ్ కాంప్లెక్స్‌లోని నాగేంద్రకు చెందిన కిరాణాషాపులో సోమవారం రాత్రి గుర్తు తెలియని దుండుగులు తాళం పగులగొట్టి షాపులో ఉన్న రూ.1.35 లక్షలు నగదు ఎత్తుకెళ్లినట్లు ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి తెలిపారు. ఆయన వివరాల మేరకు.. పట్టణానికి చెందిన నాగేంద్ర ప్రతిరోజూ ఉదయం నుండి రాత్రి 8 వరకు కిరాణా షాపు నిర్వహించుకుని తాళం వేసి ఇంటికి వెళ్లేవాడు. అందులో భాగంగా సోమవారం కూడా ఉదయం నుండి రాత్రి వరకు షాపు నిర్వహించుకుని రూ.1.35 లక్షల నగదు షాపులోనే పెట్టి తాళం వేసి ఇంటికి వెళ్లాడు. సోమవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు షాపు తాళం పగలగొట్టి అందులో ఉన్న రూ.1.35 లక్షలు అపహరించారు. నాగేంద్ర మంగళవారం ఉదయం షాపు వద్ద వచ్చి చూడగా షాపులో నగదు దొంగతనం జరిగినట్టుగా తెలుసుకుని స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఎస్‌ఐ బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

జూదరుల అరెస్ట్

కొలిమిగుండ్ల, ఆగస్టు 27 : మండలంలోని అంకిరెడ్డిపల్లె గ్రామ సమీపంలోని గీతాశ్రమం వద్ద మంగళవారం పేకాట స్థావరంపై దాడి నిర్వహించి ఆరుగురు పేకాటరాయుళ్లను అరెస్ట్ చేసినట్లు ఏఎస్‌ఐ గోవిందనాయక్ వెల్లడించారు. గ్రామానికి చెందిన వీరిని అదుపులోకి తీసుకొని రూ.3150 నగదు, పేక ముక్కలు స్వాధీనం చేసుకొని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గులాబి రంగు పురుగుతో జాగ్రత్త

పత్తి రైతులకు కేవీకే కోఆర్డినేటర్ సూచన



మాట్లాడుతున్న కేవీకే కో ఆర్డినేటర్ రాఘవేంద్ర చౌదరి

ఎమ్మిగనూరు, ఆగస్టు 27: పత్తిని విత్తిన 45 రోజుల నుంచి గులాబి రంగు పురుగు ఉనికిని గమనిస్తూ ఉండాలని కేవీకే కో.ఆర్డినేటర్ డాక్టర్ రాఘవేంద్ర చౌదరి రైతులు సూచించారు. మంగళవారం మండల పరిధిలోని బనవాసి కేవీకేలో కేవైఆర్డీ, ఎల్డీసీ సంయుక్తంగా గులాబి రంగు పురుగుపై అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కో.ఆర్డినేటర్ రాఘవేంద్ర చౌదరి మాట్లాడుతూ గులాబి రంగు పురుగు ఉనికిని గమనించి లింగాకర్షణ బుట్టలు అమర్చి వరుసగా మూడు రోజులు బట్టలతో ఎనిమిది తల్లి రెక్క పురుగులు పడిన వెంటనే సస్యరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. పత్తి నాణ్యతను పెంచుకోవటానికి ఎల్‌డీసీ సంస్థ గులాబి రంగు పురుగు నివారణకు లింగాకర్షణ బుట్టలు పంపిణీ చేస్తున్నారన్నారు. పత్తి పంట జనవరి తరువాత ఎట్టి పరిస్థితుల్లో పొలాల్లో ఉంచకూడదన్నారు. అధిక దిగుబడికోసం అధిక సాంద్రత పద్ధతిలో సాగుచేయాలన్నారు. అనంతరం 150 మందికి లింగాకర్షణ బుట్టలను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ చందన, డాక్టర్ మోనిక, విష్ణువర్ధన్ రెడ్డి, రవీంద్ర, ఎల్‌డీసీ ప్రతినిధి సంతోష్, గోపి రైతులు పాల్గొన్నారు.

బదిలీలకు 300 దరఖాస్తులు

కర్నూలు(కలెక్టరేట్), ఆగస్టు 27: ప్రభుత్వం బదిలీలకు పచ్చజెండా ఊపడంతో ఉద్యోగులు భారీగా దరఖాస్తు చేసుకున్నారు. ఐదు సంవత్సరాలు సర్వీసు పూర్తి చేసుకున్న వారు రిక్వెస్టుపై బదిలీలు కోరుకునేవారు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకున్నారు. డీఆర్‌డీఏ శాఖలో 150 మంది, భూసర్వే శాఖలో 150 మంది దరఖాస్తు చేసుకున్నారు.

సమస్యల వలయంలో ఎస్పీవై రెడ్డి నగర్

- పాణ్యం, నంద్యాల నియోజకవర్గాల మధ్య పరిధి సమస్య
- రోడ్లు, డ్రైనేజీలు నిర్మించని వైనం
- సమస్యలతో ప్రజల అవస్థలు


ఎస్పీవైరెడ్డి నగర్ ఏరియల్ వ్యూ


కాలనీలో ముళ్లకంప మధ్య రహదారి

పాణ్యం, ఆగస్టు 27: ఎస్పీవై రెడ్డి నగర్ సమస్యలతో కొట్టిమిట్లాడుతోంది. రోడ్లు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పదేళ్లుగా ఇంటి పన్నులు చెల్లించడం లేదు. విద్యుత్ మీటర్లు తొగర్చేడు పాత గ్రామానికి చెందినవే. వీధి కొళాయిలు లేవు. జలజీవన్ మిషన్ పథకం వీరికి వర్తించదు. దీనికి కారణం ఈ కాలనీ పాణ్యం మండలంలో ఉందా? లేక నంద్యాల మండలంలో ఉందా? అనేది అధికారులే తేల్చలేకున్నారు. దీంతో ఈ కాలనీలో ఏ అభివృద్ధి పనులు చేపట్టాలన్నా ప్రతిపాదనలకు, పంచాయతీ తీర్మానాలకు ఈ కాలనీ ఉన్న సర్వే నెంబరు మరో పంచాయతీలో ఉండడమే కారణం. ఇటీవల తొగర్చేడులో జగనన్న కాలనీ ఏర్పాటుకు ఆర్డీవో ఆధ్వర్యంలో సర్వే చేయించినా ఎలాంటి ఫలితం లేకపోవడంతో ప్రస్తుతం ఈ కాలనీలో ఏ అభివృద్ధి పనులు చేయాలన్నా హద్దులు అడ్డుగా నిలుస్తున్నాయి. 1996లో నంద్యాల మండలం చాపిరేవుల గ్రామ పంచాయతీ పరిధిలోని సర్వే నెంబర 323/1 లోని 6.72 ఎకరాలలో 122 తొగర్చేడు కుటుంబాలకు, 22 చాపిరేవుల కుటుంబాలకు మూడు సెంట్ల లెక్కన ఇంటి పట్టాలు ఇచ్చారు. కాగా వీటిలో కొందరు తొగర్చేడు గ్రామానికి చెందిన కుటుంబాలు ఇల్లు వేసుకొని జీవనం సాగిస్తున్నారు. ఈ కాలనీకి ఎంపీ ఎస్పీవై రెడ్డి నిధులతో సిమెంటు రోడ్డును చాపిరేవుల గ్రామ పంచాయతీ తీర్మానంతో వేశారు. ఇల్లు నిర్మించుకోని స్థలాల్లో 12 సెంట్లు షాదీఖానాకు కేటాయించారు. మరిన్ని స్థలాలు ఖాళీగా ఉండడంతో వైసీపీ ప్రభుత్వం జగనన్న కాలనీ పేరుతో మూడు సెంట్ల పట్టాలను సెంటున్నరగా మార్చి ఇంటి స్థలాలను తొగర్చేడు గ్రామస్థులకు మంజూరు చేసినా ఇంటి నిర్మాణాలు చేపట్టలేదు. కాగా ప్రస్తుతం ఉన్న దాదాపు 60 కుటుంబాలు ఎన్నికల్లో పాణ్యం నియోజకవర్గానికి చెందిన అభ్యర్థులకే ఓటు వేశారు. ఓటు వేసిన కాలనీ ప్రజలు తమ కాలనీలో అభివృద్ధి పనులు చేపట్టాలని కోరడంతో ప్రజాప్రతినిధులు, నాయకులు రోడ్లు, మురుగు కాలువల పనుల ప్రతిపాదనల కోసం గ్రామ పంచాయతీ తీర్మానం చేయాలంటే భూమి చాపిరేవులలో ఉంది. కాలనీ ఓటర్లందరూ తొగర్చేడుకు చెందిన వారు కావడంతో తమకేమి లాభమని నంద్యాల నియోజకవర్గ నాయకులు పేర్కొంటున్నట్లు తెలిసింది. తొగర్చేడు పంచాయతీ తీర్మానం చేయాలంటే సర్వే నెంబరు గజిట్‌లో మార్చాల్సి ఉంది. ఈప్రక్రియకు రాష్ట్ర కేబినెట్ ఆమోదం తెలపాలి. దీంతో సమస్యలు పరిష్కారం కాకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

రాజకీయ లబ్ధి కోసమే తాత్కాలిక పనులు

ప్రజాప్రతినిధులు తమకు అవసరమైనపుడు అధికారంతో ఉన్నతాధికారులపై ఒత్తిడి తెచ్చిమరీ తమ పనులు పూర్తి చేసుకుంటు న్నారు. ఇందులో భాగంగా విద్యుత్ స్తంభాల ఏర్పాటు, విద్యుత్ మీటర్ల మంజూరు చేశారు. కేవలం ఓట్ల కోసం అప్పటికప్పుడు తాత్కాలిక పనులు చేపట్టి ఓట్లు వేయించుకుంటున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఓట్లకోసం ప్రతిసారీ అభివృద్ధి హామీలిచ్చిన నాయకులు అభివృద్ధి చేయడంలో వెనుకంజ వేస్తున్నారని స్థానికుల ఆరోపిస్తున్నారు. ఈ కాలనీలో దాదాపు వంద ఓట్లు ఉండగా కేవలం ఓట్లు పోతాయన్న కారణంగానే తప్ప సమస్యను తీర్చలేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. వైసీపీ ప్రభుత్వం హడావుడిగా జగనన్న కాలనీ ఏర్పాటు చేసి ఓట్లు పొందాలన్న ఆశతో పట్టాలు పంపిణీ చేసిందే తప్ప కాలనీ సమస్య శాశ్వతంగా తీర్చాలన్న లక్ష్యంగా ప్రజాప్రతినిధులకు లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

దేవస్థానానికి చెందిన భూమి

సర్వే నెంబరు 323/1లోని భూమి ఆంజనేయస్వామి దేవస్థానానికి చెందిన భూమి కావడంతో ప్రజాప్రతినిధులు, అధికారులు ఎటూ తేల్చుకోలేని పరిస్థితి ఏర్పడింది. దీంతో ఈ కాలనీ వాసులు తీవ్ర సమస్యలతో ఇబ్బందులకు గురవుతున్నారు. కాలనీ ఏర్పడి దాదాపు 25 ఏళ్లు కావస్తున్నా కనీస సౌకర్యాలు లేవు. రహదారులు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని, రాత్రివేళల్లో విషసర్పాలతో భయాందోళన గురవుతున్నామని ప్రజలు చెబుతున్నారు. నెల రోజులుగా వీధి దీపాలు వెలగకపోవడంతో ఈపరిస్థితి ఏర్పడినట్లు ఆరోపిస్తున్నారు.

గెజిట్‌లో సర్వే నెంబరు మారాలి

రెవెన్యూ రికార్డుల ప్రకారం తొగర్చేడు సరిహద్దులోని ఎస్పీవైరెడ్డి కాలనీ ఉన్న 323/1 సర్వేనెంబరులోని 6.72 ఎకరాలు నంద్యాల మండలంలోని చాపిరేవుల గ్రామ పంచాయతీ పరిధిలో ఉంది. ఈ కాలనీలో అభివృద్ధి పనులు చేపట్టాలంటే గ్రామ పంచాయతీ తీర్మానం ముఖ్యం. తీర్మాణ ం చేస్తేనే అభివృద్ధి పనులకు ఆటంకం ఉండదు. ఇంటి స్థలాలు కేటాయించినా ఇల్లు మంజూరు కాలేదు. రికార్డుల ప్రకారం ఇబ్బందులు తలెతుతున్నాయి. సర్వే నెంబరును పాణ్యం మండల రెవెన్యూ పరిధిలోకి మార్చాలి. ఇందుకోసం గెజిట్‌లో నమోదు చేయాల్సి ఉంది. జగనన్న కాలనీలోని ఇంటిపట్టాలకు నంద్యాల తహసీల్దారు పట్టాలు పంపిణీ చేశారు.

\- మహేశ్వరరెడ్డి, ఆర్ఐ, పాణ్యం

అభివృద్ధి పనులకు ఆటంకం

అభివృద్ధి పనులు చేపట్టడానికి సర్వే నెంబరు ఆటంకంగా మారింది. రహదారులు, డ్రైనేజీలు తదితర పనులకు సర్వే నెంబరు కచ్చితంగా నమోదు చేయాలి. సర్వే నెంబరు నంద్యాల మండలంలో ఉండడంతో పనులు చేపట్టలేదు. 15 వ ఆర్థిక సంఘం నిధులు ఖర్చు చేయాలన్నా సర్వే నెంబరే కీలకంగా మారింది. జలజీవన్ మిషన్ నిధులకు కూడా ఆటంకం ఉది.

\- సరస్వతి, గ్రామ పంచాయతీ కార్యదర్శి, తొగర్చేడు

కమనీయం.. మహానందీశ్వరుడి కల్యాణం


మహానందిలో కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

మహానంది, ఆగస్టు 27: లోక క్షేమం కోసం మహానంది క్షేత్రంలో ఘనంగా ఈశ్వరుడు, పార్వతీదేవి కల్యాణోత్సవాన్ని వేదపండితులు ఘనంగా నిర్వహించారు. మంగళవారం ఆలయ ప్రాంగణంలోని కల్యాణ మంటపంలో వేదపండితులు రవిశంకర్ అవధాని ఆధ్వర్యంలో వేదమంత్రాలతో స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవాన్ని ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం గణపతిపూజ, పుణ్యాహవాచనం, అక్షింతల సమర్పణతో పాటు మాంగళ్యధారణను కన్నుల పండువగా నిర్వహించారు. హైదరాబాద్‌కు చెందిన భక్తులు ఈ కార్యక్రమానికి దాతలుగా వ్యవహరించారు.

సుబ్రహ్మణ్య స్వామికి విశేష పూజలు

శ్రీశైలం, ఆగస్టు 27: శ్రీశైలం మహాక్షేత్రంలో మంగళవారం లోక కల్యాణార్థం ఆలయ ప్రాంగణంలోని సుబ్రహ్మణ్య (కుమారస్వామి) స్వామికి, నందీశ్వరస్వామికి, బయలు వీరభద్రస్వామికి విశేష పూజలు నిర్వహించారు. పూజా కార్యక్రమంలో దేశం శాంతిసౌభాగ్యాలతో విలసిల్లాలని అర్చకస్వాములు సంకల్పం పఠించారు. అనంతరం పూజా కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహాగణపతిస్వామికి పూజలు చేశారు. పంచామృతాలతో అభిషేకించి మంగళహారతులు సమర్పించారు.

గణపతి గాథల పై ప్రవచనం


శ్రీశైలం మహాక్షేత్రంలో ధార్మిక కార్యక్రమాల్లో భాగంగా ప్రఖ్యాత ప్రవాచకులు సామవేదం షణ్ముఖశర్మతో 9రోజులపాటు ప్రవచన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. మంగళవారం నాలుగో రోజు కార్యక్రమంలో 'గణపతి గాథలు' ప్రఖ్యాత ప్రవాచకులు బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖశర్మ ప్రవచనం చేశారు.

భద్రతా ప్రమాణాలు తప్పనిసరి: కలెక్టర్

నంద్యాల (కల్చరల్), ఆగస్టు 27: జిల్లాలోని అన్ని ఫ్యాక్టరీలు, పరిశ్రల్లో భద్రతా ప్రమాణాలు తప్పనిసరిగి పాటించి ఉద్యోగ, కార్మికుల రక్షణకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని కలెక్టర్ రాజకుమారి నిర్వాహకులకు సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్‌హాల్‌లో ఇటీవల జరిగిన ప్రమాద ఘటనల నేపథ్యంలో జిల్లాలోని ఫ్యాక్టరీలు, పరిశ్రమల నిర్వాహకులు, ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా, జేసీ విష్ణుచరణ్ తో కలిసి కలెక్టర్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని ఫ్యాక్టరీలు, పరిశ్రమలలో అంతర్గత సేఫ్టీ ఆడిట్ త్వరితగతిన నిర్వహించి గుర్తించిన లోపాలను సరిచేస్తూ భద్రతా ప్రమాణాలు పాటించేలా చర్యలు తీసుకోవాలని డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్‌ను ఆదేశించారు. జిల్లాలోని 32 ఫ్యాక్టరీలు, 1500 సూక్ష్మచిన్న తరహా పరిశ్రమలలో పనిచేస్తున్న 28వేల మంది ఉద్యోగుల భద్రతతో పాటు ఆరోగ్య పరిరక్షణకు కూడా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. అన్ని పరిశ్రమలలో మాక్‌డ్రిల్ కండక్ట్ చేయాలని, అలారం సిస్టం తప్పకుండా ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రతి యూనిట్‌లో తరచూ తనిఖీలు చేపట్టి లోపాలుంటే తక్షణమే సరిదిద్దేలా యజమాన్యాలకు నోటీసులు జారీచేయాలన్నారు. ఎస్పీ మాట్లాడుతూ ప్రమాదాలు జరిగినప్పుడు ప్రతిస్పదన, స్వీయ రక్షణపై కార్మికులు, ఉద్యోగులకు శిక్షణ ఇవ్వాలని సూచించారు.

నంద్యాల (కల్చరల్): రిజర్వ్‌బ్యాంక్ స్థాపించి 90ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భాన్ని పురస్కరించుకొని ఆర్‌బీఐ 90 క్విజ్ పేరుతో అండర్ గ్రాడ్యుయేట్ విద్యార్థుల కోసం ఆర్‌బీఐ దేశవ్యాప్తంగా క్విజ్‌ని నిర్వహిస్తోందని కలెక్టర్ రాజకుమారి తెలిపారు. మంగళవారం తన చాంబర్‌లో ఆర్‌బీఐ 90క్విజ్ పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ విద్యార్థుల్లో ఆర్‌బీఐ, ఆర్థిక పర్యావరణ వ్యవస్థ గురించి మరింత అవగాహన కల్పించేందుకు ఆ క్విజ్ సహాయ పడుతుందన్నారు. క్విజ్‌లో 4 ద శలు ఉంటాయని, రాష్ట్ర, జోనల్, జాతీయ స్థాయి విజేతలకు రూ.లక్ష నుంచి 10లక్షల వరకు ఆకర్షణీయమైన బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. క్విజ్‌లో పాల్గొనే విద్యార్థులు హెచ్‌టీటీపీఎస్:యస్:డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ. ఆర్‌బీఐ90క్విజ్. ఇన్ ఆన్లైన్‌లో సెప్టెంబరు 17 వరకు నమోదు చేసుకోవచ్చున న్నారు. ఇతర వివరాలకు లీడ్ డిస్ట్రిక్ మేనేజర్‌ను సంప్రదించాలని కలెక్టర్ తెలిపారు.

'అసత్య కథనాలను రాస్తే సహించం'


మాట్లాడుతున్న ఎన్ఎండీ ఖుద్దూస్

నంద్యాల (నూనెపల్లె), ఆగస్టు 27: ఎన్ఎండీ ఫరూక్, ఆయన కుటుంబంపై అసత్య కథనాలను సహించబోమని మంత్రి ఎన్ఎండీ ఫరూక్ సోదరుడు ఎన్ఎండీ ఖుద్దూస్ తీవ్రంగా ఖండించారు. ఓ పత్రికలో వచ్చిన కథనంపై నంద్యాల టీడీపీ కార్యాలయంలో ఎన్ఎండీ ఖుద్దూస్‌తో పాటు టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ప్రముఖ న్యాయవాది తులసి రెడ్డి విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. కోట్ల విలువైన భూమిని కొట్టేసేందుకు మంత్రి ఫరూక్ విశ్వప్రయత్నాలు చేస్తున్నారంటూ అసత్య ప్రచారం చేశారని, స్థలానికి సంబంధించిన వివరాలను వెల్లడించారు. పత్రికా యాజమాన్యంపై పరువు నష్టం దావా వేస్తున్నట్లు తెలిపారు. టీడీపీ పట్టణ అధ్యక్షుడు మణియార్ ఖలీల్, బాబుల్లా తదితరులు పాల్గొన్నారు.

ఏపీజీఈ తాలుకా ప్రధాన కార్యదర్శిగా చంద్రశేఖర్

ఆత్మకూరు, ఆగస్టు 27: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నమెంట్ ఉద్యోగుల సంఘం ఆత్మకూరు తాలుకా ప్రధాన కార్యదర్శిగా ఆత్మకూరు అటవీ డివిజన్ కార్యాలయ జూనియర్ అసిస్టెంట్ చంద్రశేఖర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ భవనంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఏపీజీఈ తాలుకా ప్రధాన కార్యదర్శిగా చంద్రశేఖర్‌ను సహచర ఉద్యోగులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా ఆత్మకూరు అటవీ డివిజన్ కార్యాలయ సూపరిన్‌డెంట్ చాంద్‌బాషా వ్యవహరించేవారు. అయితే ఆయన రిటైర్డు కావడంతో ఆయన స్థానంలో చంద్రశేఖర్‌ను ఎన్నుకున్నారు. ఆ సంఘం నాయకులు ఆయనను ఘనంగా సత్కరించారు. సంఘం నాయకులు మస్తానయ్య, శ్రీనివాసులు, సుదర్శనం, గుర్రప్ప, రమణ, వెంకటరమణగౌడ్, ధనలక్ష్మి, రమణమ్మ, రసూల్, పద్మావతి, దస్తగిరి తదితరులు ఉన్నారు.

పాఠశాల ఆకస్మిక తనిఖీ


పాములపాడులో ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న డీఈవో

పాములపాడు, ఆగస్టు 27: పాములపాడులోని ఏఎస్ఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను జిల్లా విద్యాశాఖ అధికారి సుధాకరరెడ్డి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. హెచ్ఎం గోపాల్, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. డీఈవో మాట్లాడుతూ విద్యార్థుల సంఖ్య పెంచడానికి కృషి చేయాలని, ఉపాధ్యాయుల కొరతపై ఆరాతీశారు. నాడు-నేడు పనులు, చేపట్టాల్సిన అంశాలపై చర్చించారు. జిల్లాలో 2,500 మంది విద్యా వలంటీర్లను సెప్టెంబరులో తీసుకోనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రవి, రామకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

ఆత్మకూరు: మండలంలోని కొట్టాలచెరువు గ్రామంలో ప్రధానమంత్రి ఆదివాసి న్యాయమహా అభియాన్ కార్యక్రమంలో నూతనంగా నిర్మించనున్న ఆదివాసి బాలుర వసతి గృహానికి సంబంధించిన స్థలాన్ని సోమవారం డీఈవో సుధాకరరెడ్డి, శ్రీశైలం ఐటీడీఏ ఇంచార్జ్ పీవో సురేష్‌కుమార్ పరిశీలించారు. వారు మాట్లాడుతూ కేంద్రం రూ.2.30కోట్లతో మంజూరు చేసిన ఆదివాసి బాలుర వసతి గృహ నిర్మాణానికి సెప్టెంబరు మొదటి వారంలో కొట్టాలచెరువులో భూమిపూజ చేయనున్నట్లు తెలిపారు. అదేరోజు సభను నిర్వహించేలా ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. అనంతరం వారు గ్రామంలోని ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. వీరి వెంట తహసీల్దార్ రత్నరాధిక, ఎంఈవో బాలాజీనాయక్, డిప్యూటీ తహసీల్దార్ హరికృష్ణ తదితరులు ఉన్నారు.

మద్యం విక్రేత అరెస్టు

గడివేముల, ఆగస్టు 27: మండలంలోని కరిమద్దెల గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఈడిగ నరసింహులును అరెస్టు చేసి 20 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ సీసీ నాగార్జునరెడ్డి తెలిపారు. కరిమద్దెల గ్రామంలో మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం మేరకు మంగళవారం తనిఖీలు చేయగా మద్యం బాటిళ్లు లభ్యమయ్యాయని చెప్పారు. నరసింహులును అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

'పకడ్బందీగా సర్వే చేపట్టాలి'

గడివేముల, ఆగస్టు 27: ఓటరు వెరిఫికేషన్ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని తహసీల్దార్ విద్యాసాగర్ బీఎల్‌వోలు, సూపర్‌వైజర్లను ఆదేశించారు. తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం బీఎల్‌వోలతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ ఓటరు వెరిఫికేషన్ సర్వేను సెప్టెంబరు 20వ తేదీ వరకు నిర్వహించాలన్నారు. ఇంటింటికి వెళ్లి ఓటరు జాబితాను తనిఖీ చేయాలన్నారు. ఫారం-6, 7, 8 దరఖాస్తులను పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. డిప్యూటీ తహసీల్దార్ గురునాథం తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల నిరసన


విద్యార్థులతో కలిసి ధర్నా చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

జూపాడుబంగ్లా, ఆగస్టు 27: మండ్లెం గ్రామం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు పాఠశాలకు వెళ్లాలంటే నరకం అనుభవిస్తున్నారని ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో విద్యార్థులు ధర్నా చేపట్టారు. పాఠశాల ముందు జాతీయ రహదారిపై కల్వర్టు ఎత్తుతక్కువగా నిర్మించడమే కాకుండా గుంతలో వర్షంనీరు నడుములోతు నిల్వ ఉండటంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఎమ్మార్పీఎస్ నాయకులు స్వాములు అన్నారు. అధికారులు స్పందించి ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టి విద్యార్థుల ఇబ్బందులను దూరం చేయాలని కోరారు.

నియోజకవర్గ సమస్యలు పరిష్కరించాలి

- మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి


కలెక్టర్‌కు సమస్యలు వివరిస్తున్న మాజీ ఎమ్మెల్యే


నంద్యాల (నూనెపల్లె), ఆగస్టు 27: నంద్యాల నియోజకవర్గ పరిధిలోని సమస్యలను పరిష్కరించాలని టీడీపీ మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి కలెక్టర్‌ను కోరారు. మంగళవారం కలెక్టర్‌ఛాంబర్‌లో కలెక్టర్ రాజకుమారిని ఆయన కలిసి వినతి పత్రం అందజేశారు. నియోజక వర్గ పరిధిలోని సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. టీడీపీ నాయకులు ఉన్నారు.

'త్వరలో నదీతీర గ్రామాలకు విద్యుత్ సౌకర్యం'


జానాలగూడెంలో విద్యుత్ సౌకర్యంపై గ్రామస్థులతో చర్చిస్తున్న ఎస్ఈ ఉమాపతి

కొత్తపల్లి, ఆగస్టు 27: నల్లమలలోని కృష్ణానది తీర గ్రామాలైన సంగమేశ్వరం నుంచి సిద్దేశ్వరం, జానాల గూడెం, బలపాలతిప్ప గ్రామాలకు విద్యుత్ సౌకర్యం కల్పిస్తున్నట్లు ఎస్ఈ ఉమాపతి తెలిపారు. మండలంలోని కృష్ణానదితీర గ్రామాలను జిల్లా విద్యుత్ శాఖ పర్యవేక్షణాధికారి ఉమాపతితో పాటు ఆత్మకూరు ఆ శాఖ డీఈ జయశంకర్, ఏడీ రమేష్‌బాబు మంగళవారం క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. అందులో భాగంగా సంగమేశ్వరం నుంచి జానాల గూడెం వరకు ఏడున్నర కిలోమీటర్ల మేర 230 విద్యుత్ స్థంభాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అలాగే ఈ గ్రామాల పరిధిలో నాలుగు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ సామగ్రి కొరకు కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపగా.. రూ.70 లక్షల నిధులు మంజూరు చేసినట్లు చెప్పారు. ఎన్నో ఏళ్లుగా చీకట్లో మగ్గుతున్న ఈ గ్రామాలకు విద్యుత్ వెలుగులు రానున్నట్లు ఎస్ఈ ఉమాపతి వెల్లడించారు. వీరి వెంట విద్యుత్ సిబ్బంది ఉన్నారు.

వైభవంగా పల్లకీ సేవ


పూజలు చేస్తున్న టీడీపీ నాయకులు

నంద్యాల (కల్చరల్), ఆగస్టు 27: నంద్యాల పద్మావతీనగర్‌లో వెలసిన శ్రీకృష్ణమందిరంలో మంగళవారం వైభవంగా శ్రీకృష్ణునికి పల్లకిసేవ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్, రాష్ట్ర కార్యదర్శి తులసిరెడ్డి శ్రీకృష్ణుని పల్లకీ సేవలో పాల్గొని తరించారు. ఆలయ కమిటీ నిర్వాహకులు పార్థసారధికృష్ణ, శివశంకర్‌యాదవ్ పాల్గొన్నారు.

'ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలి'

నంద్యాల రూరల్, ఆగస్టు 27: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని హెచ్ఎం పెద్దశ్రీనివాసులు సూచించారు. చాపిరేవుల జెడ్పీ హైస్కూల్‌లో మంగళవారం వరల్డ్ విజన్ ఇండియా సేవా సంస్థ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేశారు. సంస్థ కోఆర్డినేటర్ జెస్సీ ప్రాజెక్టు అధికారి హనుమంతరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడి మృతికి నివాళి


నివాళి అర్పిస్తున్న గౌరు దంపతులు

పాణ్యం, ఆగస్టు 27: మండలంలోని మద్దూరు గ్రామ టీడీపీ నాయకుడు సుధాకర్ రెడ్డి (55) మంగళవారం గుండెనొప్పితో మృతి చెందారు. ఆయన మృతి పట్ల ఎమ్మెల్యే గౌరు చరిత, నందికొట్కూరు నియోజకవర్గ ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. సుధాకర్‌రెడ్డి భౌతికకాయానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. టీడీపీకి సుధాకర్‌రెడ్డి చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు జయరామిరెడ్డి, ఖాదర్‌బాషా, మిలిటరీ సుబ్బారెడ్డి, కృష్ణ, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేరాలు జరిగే ప్రదేశాలను గుర్తించాలి: ఎస్పీ

నంద్యాల క్రైం, ఆగస్టు 27: జిల్లాలో నేరాలు జరిగే ప్రదేశాలను గుర్తించాలని ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా సిబ్బందిని ఆదేశించారు. నంద్యాల జిల్లా పోలీస్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో మంగళవారం ఆళ్లగడ్డ సబ్ డివిజన్ పోలీస్ అధికారులతో నిర్వహించిన నేర సమీక్షా సమావేశంలో ఎస్పీ మాట్లాడారు. పోలీస్ అధికారులు, సిబ్బంది ప్రజల మధ్య ఉంటూ నేరాలు జరగకుండా చూస్తూ ఫ్రెండ్లీ పోలీసింగ్‌పై దృష్టి సారించాలన్నారు. విజిబుల్ పోలీసింగ్, పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రసల్ సిస్టంలో వచ్చే ఫిర్యాదులకు ప్రాధాన్యమిస్తూ చట్టపరిధిలో నిర్ణీత సమయంలో వాటిని పరిష్కరించాలన్నారు. పట్టణంలో, పరిసర గ్రామాల్లో స్కూళ్లు, కళాశాలల వద్ద, ముఖ్యమైన కూడళ్లలో, పట్టణ శివారులో నేరాలు జరిగే ప్రదేశాలను గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలన్నారు. ఆళ్లగడ్డ సబ్ డివిజన్‌లో హైవే పరిధి ఎక్కువగా ఉండడంతో రోడ్డు ప్రమాదాలు జరగకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. ముఖ్యంగా బ్లాక్ పాయింట్స్ వద్ద స్పీడ్ బ్రేకర్స్ ఏర్పాటు చేయాలన్నారు. టర్నింగ్‌లలో, ముఖ్యమైన ప్రాంతాల్లో సిగ్నల్ బోర్డులు ఉండేలా చూసుకోవాలన్నారు. హైవే మొబైల్స్ సహకారంతో హైవేలలో జరిగే దొంగతనాలపై నిఘా ఉంచి నివారణ చర్యలు తీసుకోవాలన్నారు. పట్టణాలు, గ్రామాల్లో సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి నేరాలు జరగకుండా, కమ్యూనల్ గొడవలు జరగకుండా సైబర్ క్రైమ్, రోడ్డు ప్రమాదాలు, భూ తగాదాలు తదితరాలు జరగకుండా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఆళ్లగడ్డ సబ్ డివిజన్‌లోని పరిశ్రమల్లో జరిగే ప్రమాదాలపై అవగాహన కలిగి ఉండి నివారణ చర్యలతోపాటు ఏదైనా అనుకోని ఘటన జరిగినపుడు తీసుకోవాల్సిన భద్రతాచర్యలపై యాక్షన్ ప్లాన్ తయారు చేసుకోవాలని అన్నారు. చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్న పలు కేసుల వివరాలు తెలుసుకొని దర్యాప్తు వేగం పెంచి బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ సంతోష్, ఆళ్లగడ్డ డీఎస్పీ రవికుమార్, సబ్ డివిజన్‌లోని ఇన్‌స్పెక్టర్లు, ఎస్సైలు పాల్గొన్నారు.

హాస్టళ్లలో సమస్యలపై ఆరా

కొత్తపల్లి, ఆగస్టు 27: పాలెంచెరువు గిరిజన ఆశ్రమ పాఠశాల, కొత్తపల్లి బీసీ బాలుర వసతి గృహాల్లో నెలకొన్న సమస్యలపై ఎంపీడీవో దాసరి మేరీ, డిప్యూటీ తహసీల్దార్ పెద్దన్న క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. వారు మాట్లాడుతూ పాలెంచెరువు గిరిజన ఆశ్రమ పాఠశాలలో కాంపౌండు గేటు, ప్రత్యేకంగా విద్యార్థినులకు అటాచ్డ్ బాత్‌రూములు, కిచెన్ రూము, డైనింగ్ హాలు, రూఫ్, ఫ్లోరింగ్ లేనట్లు గుర్తించామన్నారు. అలాగే కొత్తపల్లి బీసీ హాస్టల్‌లో ఆర్వో ప్లాంటు, బాత్‌రూమ్‌లు, గదుల కిటికీలకు నెట్లు లేనట్లు గుర్తించామన్నారు. ప్రభుత్వానికి నివేదిస్తున్నట్లు చెప్పారు.

'డబ్బులు రికవరీ చేయాలి'

జూపాడుబంగ్లా, ఆగస్టు 27: అరుణోదయ గ్రామైక్య సంఘంలో పనిచేస్తున్న పొదుపు సంఘం బుక్‌కీపర్‌పై చర్యలు తీసుకొని డబ్బులు రికవరీ చేయాలని పొదుపు మహిళలు డిమాండ్ చేశారు. మంగళవారం జూపాడుబంగ్లాలోని జాతీయ రహదారిపై ర్యాలీ నిర్వహించారు. పీడీ, ఏపీఎం, పోలీసుస్టేషనులో ఫిర్యాదు చేసినా పట్టించుకోకుండా, విచారణ చేయకుండా అధికారులు జాప్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బుక్‌కీపర్ దాదాపు రూ. 5లక్షల వరకు రుణాలు చెల్లించకుండా వాడుకున్నట్లు తెలుస్తోందని, బుక్‌కీపర్‌పై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు వారు తెలిపారు.

సాదాసీదాగా సర్వసభ్య సమావేశం

మిడుతూరు, ఆగస్టు 27: మిడుతూరు మండల సర్వసభ్య సమావేశం సాదాసీదాగా సాగింది. మంగళవారం సర్వసభ్య సమావేశం ఎంపీపీ మల్లు వెంకటేశ్వరమ్మ అధ్యక్షతన నిర్వహించారు. ఎంపీడీవో నాగేశాచల రెడ్డి, తహసీల్దార్ శ్రీనివాసులు పాల్గొన్నారు. తహసీల్దార్ మాట్లాడుతూ రేషన్ డీలర్ల ద్వార సరఫరాచేసే నిత్యఅవసర సరుకులను ప్రజలకు సక్రమంగా అందజేస్తున్నట్లు తెలిపారు. అన్నారు, రోడ్లు భవనాల శాఖ ద్వారా జరిగిన ప్రగతిని ఆశాఖ డీఈ ధణిబాబు సభ్యులకు వివరించారు. తిమ్మాపురం, పీరుసాహేబ్ పేట రోడ్ల నిర్మాణం జరగక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆయా గ్రామాల సర్పంచులు ఆరోపించారు. పశువైద్య అధికారి చంద్రమోహన్ మాట్లాడుతూ రైతులు తమ పశువుల కొరకు గోశాలలు ఏర్పాటు చేసుకోవడానికి గోశాలల కోసం రైతులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. పశువులకు గాలికుంట్ల నివారనకు టీకాలు వేయనున్నట్లు తెలిపారు. వెద్యాధికారి రాజు మాట్లాడుతూ అడల్టు వీసీజీ వ్యాక్సిన్ ప్రతి ఒక్కరూ వేయించుకోవాలని అన్నారు. ఆయా శాఖల అధికారులు తమ తమ శాఖల గురించి వివిరించడం జరగగా వాటిపై ఎటువంటి చర్చ జరగలేదు. పీఆర్ డీఈ ధణి బాబు, ఈవోఆర్డీ ఫక్రుద్దీన్, వైద్యాధికారి మద్దిలేటి, విద్యుత్ ఏఈ క్రాంతి కుమార్, ఏపీఎం సుబ్బయ్య, ఏపీవో జయంతి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వరలక్ష్మి, మండల ఉపాధ్యక్షుడు నబిరసూల్, సర్పంచులు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

నందికొట్కూరు, ఆగస్టు 27: నందికొట్కూరు మున్సిపాల్టీ కౌన్సిల్ సమావేశం నేడు జరగనుంది. గత నెలలో అనివార్య కారణాల వల్ల కౌన్సిల్ సమావేశం వాయిదా పడింది. ఎమ్మెల్యే గిత్తా జయసూర్య, ఎంపీ డా. బైరెడ్డి శబరిలు హాజరు కానున్నారు.

నేడు సర్వ సభ్య సమావేశం

వెలుగోడు: వెలుగోడు మండల సర్వ సభ్య సమావేశం ఎంపీపీ రమేష్ అధ్యక్షతన బుధవారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో అమానుల్లా తెలిపారు. సంబంధిత అధికారులు ప్రగతి నివేదికలతో హాజరు కావాలని ఆయన కోరారు. అలాగూ ఎంపీటీసీలు, సర్పంచ్‌లు తప్పకుండా హాజరు కావాలన్నారు.

30న వాహనాల వేలం

నంద్యాల (నూనెపల్లె), ఆగస్టు 27: ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడిన వివిధ వాహనాలను ఈ నెల 30న ఉదయం 10 గంటలకు బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు నంద్యాల ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. నంద్యాల సెబ్ స్టేషన్ ఆవరణలో వేలం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మరింత సమాచారం కోసం నంద్యాల సబ్ స్టేషన్ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

మున్సిపల్ కౌన్సిల్‌లో 15 తీర్మానాలు ఆమోదం


మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్

ఆత్మకూరు, ఆగస్టు 27: ఆత్మకూరు మున్సిపల్ కార్యాలయంలో ఛైర్మన్ డాక్టర్ మారూఫ్ ఆసియా అధ్యక్షతన మంగళవారం జరిగిన మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో 15 తీర్మానాలను సభ్యులు ఆమోదం తెలిపారు. ఇందులో ప్రధానంగా తాగునీటి పన్నును ఏడాదికి రూ.600 నుంచి 960కి పెంచుతూ తీర్మానించారు. కోఆప్షన్ సభ్యుడైన శకునాల తిరుపతయ్య రాజీనామాను తిరస్కరించారు. అన్నా క్యాంటీన్ ఆధునీకరణకు ప్రభుత్వం రూ.7.50లక్షలు మంజూరు చేయగా అదనంగా మరో రూ.5.50 లక్షలతో క్లాడింగ్స్ చేయాలని నిర్ణయించారు. ఇవేకాకుండా పట్టణంలోని పారిశుధ్య పనులను చేపట్టేందుకు జనరల్ ఫండ్ నుంచి నిధులను ఖర్చు చేయాలని తీర్మానించారు. అలాగే బట్టర్ ఫ్లై వీధిదీపాల మరమ్మతుల నిమిత్తం రూ.5.50 లక్షల వ్యయంతో హైడ్రాలిక్ ల్యాడర్‌ను కొనుగోలు చేయాలని నిర్ణయించారు. మున్సిపల్ కౌన్సిల్ సమావేశాల కోసం కార్యాలయంలోని ఓ గదిని ఆధునీకరించేందుకు రూ.2.95 లక్షలు ఖర్చు చేయాలని తీర్మానించారు. పట్టణంలోని తాగునీటి బావుల చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటుకు రూ.5లక్షలు ఖర్చు చేయాలని నిర్ణయించారు. మున్సిపాలిటీలో కంప్రెస్డు బయో గ్యాస్ ప్లాంట్లు ఏర్పాటు చేయుటకు 10ఎకరాల ప్రభుత్వ లేదా కొనుగోలు భూమిని కేటాయించాలని ఆమోదిం చారు. అదేవిధంగా తడి, పొడి చెత్తను వేరు చేసేందుకు సీవేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్ ఏర్పాటుకై 3 ఎకరాల స్థలాన్ని సేకరించాలని నిర్ణయించారు. రూ.3కోట్లతో నిర్మించనున్న మున్సిపల్ కార్యాలయ భవన నిర్మాణానికి మరో సారి టెండర్లను పిలవాలని నిర్ణయించారు. ఇదిలావుంటే పట్టణంలో మౌలిక సదుపాయాల కల్పనపై సభ్యులు మున్సిపల్ అధికారులను ప్రశ్నించారు. మున్సిపల్ కమిషనర్ హరిప్రసాద్, కౌన్సిల్ సభ్యులు, కోఆప్షన్ సభ్యులు ఉన్నారు.

డోన్, ఆళ్లగడ్డ, బనగానపల్లె

టీజీపీ బ్లాక్ చానళ్లకు సాగునీరు


టీజీపీ కాలువ నీటి ప్రవాహాన్ని పరిశీలిస్తున్న ఈఈ, డీఈ

చాగలమర్రి, ఆగస్టు 27: ఆళ్లగడ్డ సబ్‌డివిజన్ పరిధిలోని టీజీపీ బ్లాక్ చానళ్లకు ప్రధాన కాలువ నుంచి డిస్ట్రిబ్యూటర్ ద్వారా నీరు విడుదల చేశామని జిల్లా టీజీపీ ఈఈ శంకర్‌రెడ్డి, డీఈ వెంకట్‌రమణ తెలిపారు. సోమవారం మండలంలోని చిన్నవంగలి గ్రామ సమీపంలోగల టీజీపీ ప్రధాన కాలువలో ప్రవహిస్తున్న నీటి ప్రవాహాన్ని పరిశీలించారు. వారు మాట్లాడుతూ ప్రస్తుతం కాలువలో 2,800 క్యూసెక్కుల నీరు ప్రవహిస్తోందని అన్నారు. కడప జిల్లాలోని బ్రహ్మసాగర్‌కు 3 వేల క్యూసెక్కుల నీరు తరలిస్తున్నామని అన్నారు. ఇప్పటి వరకు 4.50 టీఎంసీల నీటిని బ్రహ్మసాగర్‌కు పంపించామని అన్నారు. వెలుగోడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి టీజీపీ కాలువకు 5 వేల క్యూసెక్కుల నీరు విడుదల చేశారని అన్నారు. మండలంలోని ముత్యాలపాడు, చింతలచెరువులకు టీజీపీ నీరు నింపుతున్నామని అన్నారు. 35, 36, 37 బ్లాక్‌చానళ్లకు చివరి ఆయకట్టు వరకు సాగునీరు రైతులకు అందిస్తున్నామని అన్నారు. రైతులు సాగునీటిని పొదుపుగా వాడుకోవాలని సూచించారు. రైతులు అనుమతిలే లేనిదే గేట్లు ఎత్తరాదని అన్నారు. వారి వెంట ఏఈలు, వర్క్‌ఇన్‌స్పెక్టర్లు ఉన్నారు.

గొట్లూరు రహదారికి మరమ్మతులు

టీడీపీ నాయకుడు జమాల్‌రెడ్డి సొంత నిధులతో పనులు


గొట్లూరు రహదారిలో ఎక్స్‌కవేటర్‌తో మరమ్మతులు చేయిస్తున్న టీడీపీ నాయకుడు

చాగలమర్రి, ఆగస్టు 27: మండలంలోని గొట్లూరు గ్రామానికి వెళ్లే రహదారి గుంతలమయంగా మారింది. గ్రామ టీడీపీ నాయకుడు జమాల్‌రెడ్డి స్పందించి తన సొంత నిధులతో మంగళవారం రోడ్డు మరమ్మతు పనులు ప్రారంభించారు. కలుగొట్లపల్లె నుంచి గొట్లూరుకు వెళ్లే 4 కి.మీ రహదారి మరమ్మతు పనులకు ఎక్స్‌కవేటర్‌తో ఇరువైపులా కంప చెట్లను తొలగించి, గుంతలను పూడ్చారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వైద్య శిబిరం

కోవెలకుంట్ల, ఆగస్టు 27: పట్టణంలోని శ్రీవాసవీ బొమ్మిడాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వైస్ ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ వైద్యశిబిరంలో కోవెలకుంట్ల సీహెచ్‌సీ క్షయవ్యాధి నిపుణులు డాక్టర్ వెంకటలక్ష్మి, డాక్టర్ సృజన, మాయలూరు పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ రాపక్ కెనడీ పాల్గొని విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు.

నిరుపేదలకు వరం అన్న క్యాంటీన్లు

కోవెలకుంట్ల, ఆగస్టు 27 : నిరుపేదలకు వరం అన్నక్యాంటీన్ పథకమని బనగానపల్లె నియోజకవర్గ డాక్టర్ల విభాగం అధ్యక్షుడు, యువ నాయకుడు డాక్టర్ పేర్ల శ్రీధర్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం అన్ని వర్గాల అభివృద్ధికి కృషి చేస్తుందన్నారు. పేదలకు ఆకలి తీర్చేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నక్యాంటీన్ ప్రారంభించారని అన్నారు.

పశువులకు టీకాలు తప్పనిసరి

చాగలమర్రి, ఆగస్టు 27: గ్రామాల్లో రైతులు పశువులకు గాలికుంటువ్యాధి నివారణ టీకాలు తప్పనిసరిగా వేయించుకోవాలని ఏడీ వరప్రసాదు సూచించారు. మంగళవారం చాగలమర్రి గ్రామంలోని పశువైద్య కేంద్రంలో గేదెలకు టీకాలు వేశారు. ఆయన మాట్లాడుతూ చాగలమర్రి, ఉయ్యాలవాడ మండలాల్లో పశువైద్య సిబ్బంది, గోపాలమిత్ర సభ్యులు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేస్తున్నారని, రైతులు పశువైద్య సిబ్బందికి సహకరించి పశువులకు టీకాలు వేయించాలని అన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన కల్గి ఉండాలి

బనగానపల్లె , ఆగస్టు 27: విద్యార్థులు సైబర్ నేరాలపై పూర్తి స్థాయి అవగాహన కల్గి ఉండాలని బనగానపల్లె ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ కోర్డినేటర్ కౌసల్యాదేవి అన్నారు. మంగళవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన, ఆన్‌లైన్ మోసాలు, ఆడపిల్లల బ్లాక్‌మెయిలింగ్ వంటి విషయాలపై అవగాహన కల్పించారు. ఉద్యోగాల మోసాలు, కంపెనీ మోసాలు, మొబైల్స్‌కు వచ్చే ఓటీపీలపై జాగ్రత్తగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో అధ్యాపకులు సూర్యనారాయణరెడ్డి, మహమ్మద్‌గౌస్, రామకృష్ణ, ఉమామహేశ్వరరెడ్డి, రామన్న, నాగరాజారెడ్డి, రవికుమర్, వరలక్ష్మి, నాగతిమ్మయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

'పశు బీమా'ను సద్వినియోగం చేసుకోండి

కొలిమిగుండ్ల, ఆగస్టు 27 : మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన పశు పోషకులు ప్రభుత్వం అందిస్తున్న పశు బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని పశు వైద్యాధికారి డా.పద్మావతి మంగళవారం సూచించారు. పాడి రైతులు పశువుల బీమా చేసుకోవడం ద్వారా తమకు రక్షణగా ఉంటుందని అన్నారు. ప్రతి రైతు అవకాశాన్ని ఉపయోగించుకోవాలని అన్నారు.

యాదవుల అభివృద్ధికి సహకరిస్తా

● ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి

డోన్, ఆగస్టు 27 : యాదవుల అభివృద్ధికి అన్ని రకాలుగా సహకారాలు అందిస్తానని డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వై.నాగేశ్వరరావు యాదవ్ ఆధ్వర్యంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. సాక్షి నివాస్‌లోని శ్రీకృష్ణుని గుడిలో ఎమ్మెల్యే కోట్ల ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే కోట్ల కిరీటం ధరించి పిల్లనగ్రోవి వాయించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అనంతరం పాతబస్టాండు వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ సీఎం చంద్రబాబు రాష్ట్రాభివృద్ధి కోసం ఎంతగానో కృషి చేస్తున్నారన్నారు. టీడీపీ కూటమి ప్రభుత్వంలో యాదవులకు సముచితం స్థానం సీఎం చంద్రబాబు కల్పించారన్నారు. డోన్ నియోజకవర్గంలో యాదవుల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. అనంతరం వై.నాగేశ్వరరావు యాదవ్ మాట్లాడుతూ ఎమ్మెల్యే కోట్ల సహకారంతో డోన్‌లో శ్రీకృష్ణుని గుడి నిర్మాణాన్ని పూర్తి చేసుకుందామన్నారు. యాదవులు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. కార్యక్రమంలో డా.సుంకన్న, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ టీఈ కేశన్నగౌడ్, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి విజయభట్టు, మండల పార్టీ అధ్యక్షుడు శ్రీనివాసులు యాదవ్, తిమ్మయ్య యాదవ్, సర్పంచ్ రేగటి అర్జున్ రెడ్డి, లక్ష్మీనారాయణ యాదవ్, నాల్గవ వార్డు కౌన్సిలర్ సుబ్బలక్ష్మి, గురుస్వామి యాదవ్, బద్దల వెంకటేశ్, రామ్మోహన్ యాదవ్, కోదండ రామయ్య పాల్గొన్నారు.

వైభవంగా 108 కలశాలతో మహాభిషేకం

చాగలమర్రి, ఆగస్టు 27: చాగలమర్రి గ్రామంలోని పట్టాభిరామాలయంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల ముగింపు సందర్భంగా మంగళవారం ఇస్కాన్‌వారి ఆధ్వర్యంలో 26 నదీ జలాలు, 108 కళశాలతో శ్రీకృష్ణ, బలరాముల మహాభిషేకం వైభవంగా నిర్వహించారు. ఇస్కాన్ పండితులు శ్రీకృష్ణుడికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. శివరామానంద ఆశ్రమంలో ఏర్పాటు చేసిన ఉట్టికొట్టే కార్యక్రమం అందరిని ఆకట్టుకుంది. చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని అలరింప చేశాయి. కార్యక్రమంలో ఎస్ఎస్ఎఫ్, హిందూ సంఘ నాయకులు, ఆర్యవైశ్య కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

బేతంచెర్ల: కృష్ణాష్టమి పురస్కరించుకుని పట్టణ శివారులోని నంద్యాల రహదారిలో వెలసిన గోపాలకృష్ణ బృందావనం వేణుగోపాల స్వామికి పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం మధ్యాహ్నం సమయంలో 10 నుంచి 12 సంవత్సరాలలోపు చిన్నారులకు రాధాకృష్ణుని వేషాధారణల పోటీలను నిర్వహించారు. గెలుపొందిన విజేతలకు చిన్నారులకు ప్రథమ బహుమతి రూ.1,516, రెండో బహుమతి రూ.1,016, మూడో విజేతకు రూ.516 బహుమతులు గోపాలకృష్ణ బృందావనం కమిటీ సభ్యులు ప్రధానం చేశారు. మధ్యాహ్నం 12 గంటలకు చిన్నారులచే ఉట్టిగొట్టే కార్యక్రమాన్ని నిర్వహించా రు. కార్యక్రమంలో గోపాలకృష్ణ బృందావనం కమిటీ సభ్యులు భక్తులు పాల్గొన్నారు.

దొర్నిపాడు: మండలంలోని దొర్నిపాడు గ్రామంలో మంగళవారం శ్రీకృష్ణాష్టమి వేడుకలను యాదవ సంఘం కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. శ్రీకృష్ణుడికి అర్చకులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఉట్టికొట్టే కార్యక్రమం నిర్వహించారు. పిల్లలు, యువకులు సందడి చేస్తూ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

ప్యాపిలి: మండలంలోని ఏనుగమర్రి, జలదుర్గం, మెట్టుపల్లి, హుసేనాపురం, ప్యాపిలి గ్రామాల్లో కృష్ణాష్టమి వేడుకలు శ్రీప్రబోధానంద సేవాసమితి ఆధ్వర్యంలో రెండో రోజు మంగళవారం కొనసాగాయి.

కొలిమిగుండ్ల: కొలిమిగుండ్ల మండలంలో ప్రబోధ సేవాసమితి, ఇందూ జ్ఞానవేదిక ఆధ్వర్యంలో జరిగే శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో పాల్గొనాలని మంత్రి బీసీ జనార్ధనరెడ్డి సతీమణి బీసీ ఇందిరమ్మకు కొలిమిగుండ్ల మండల కమిటీ సభ్యులు విజ్ఞప్తిచేశారు. మంగళవారం త్రైతసిద్ధాంతం సభ్యులు మీర్జాపురం పీఎంహెచ్ నాయుడు, రామక్రిష్టారెడ్డి, ఆశోక్, నవీన్, టీడీపీ నాయకులు అందెరాము ఇందిరమ్మను కలిసి ఆహ్వాన పత్రికను అందించారు. మీర్జాపురం గ్రామంలో సెప్టెంబరు-2, కొలిమిగుండ్లలో 4న శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా గ్రామోత్సవం కార్యక్రమాలను చేపడుతున్నట్లు వారు వివరించారు.


డోన్‌లో కృష్ణాష్టమి వేడుకల్లో పిల్లనగ్రోవి వాయిస్తున్న ఎమ్మెల్యే కోట్ల


చాగలమర్రి శివరామానంద ఆశ్రమంలో ఉట్టి కొడుతున్న మహిళలు


బేతంచెర్లలో ఉట్టి కొడుతున్న చిన్నారులు

పేదలకు వైద్యసేవలు అందించడమే లక్ష్యం

వంద పడకల వైద్యశాలగా మారుస్తా: ఎమ్మెల్యే అఖిలప్రియ


మాట్లాడుతున్న ఎమ్మెల్యే అఖిలప్రియ

ఆళ్లగడ్డ, ఆగస్టు 27: పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే అఖిలప్రియ అన్నారు. ఆళ్లగడ్డ ప్రభుత్వ వైద్యశాలలో మంగళవారం అభివృద్ధి కమిటీని నూతనంగా ఏర్పాటు చేశారు. ఆమె మాట్లాడుతూ 2019లో టీడీపీ ప్రభుత్వం 15 పడకల వైద్యశాలను యాభై పడకల వైద్యశాలగా మార్పు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసిందని, ఇందుకు రూ.8 కోట్లను మంజూరు చేసిందని గుర్తు చేశారు. ఆ తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఆ నిధులతో కేవలం ప్రభుత్వ వైద్యశాల ముందర మాత్రమే అభివృద్ధి చేసి వెనుక వదిలేసిన పనులను ప్రారంభించామన్నారు. ప్రభుత్వ వైద్యశాలను వంద పడకల వైద్యశాలగా మార్చి పేదలకు ఖరీదైన వైద్యం అందుబాటులోకి తెస్తానన్నారు. నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేసేందుకు సీఎం చంద్రబాబునాయుడుతో సహా అన్ని శాఖల మంత్రులను కలుస్తుండగా ఇది ఓర్వలేని వారు తనపై ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. ఆళ్లగడ్డలో వ్యాపారస్తులను బెదిరిస్తే తన దృష్టికి తీసుకరావాలని, వారు ఎంతటి వారైన చర్యలు తీసుకుంటామని అన్నారు. అనంతరం వైద్యశాలలో రోగులకు అందుతున్న వైద్య సేవలపై రోగులను అడిగి తెలుసుకున్నారు. వైద్యశాలలో ఎమ్మెల్యే కంటి పరీక్ష చేయించుకున్నారు. ఈ సమావేశంలో వైద్యశాల సూపరింటెండెంట్ సుజాతమ్మ, సూపర్‌వైజర్ దస్తగిరిరెడ్డి పాల్గొన్నారు.

గ్రామ సమస్యలు పరిష్కరించాలి

రుద్రవరం, ఆగస్టు 27 : గ్రామ సమస్యలు పరిష్కరించాలని సీపీఐ నాయకులు బాలనరసింహుడు, భాస్కర్ అన్నారు. మంగళవారం పెద్దకంబలూరు గ్రామంలో గ్రామ సభ నిర్వహించారు. గ్రామ సభలో కార్యదర్శి షాహినూర్‌కు వినతిపత్రం అందించారు. గ్రామంలో సమస్యలు పరిష్కరించాలని కోరారు. శ్మశాన స్థలం గుర్తించి ప్రహరీ నిర్మించాలన్నారు. శ్మశానం వరకు రోడ్డు వేయాలని, డ్రైనేజీ నిర్మాణం, కొత్త సీసీ రోడ్డు, అంతర్గత డ్రైనేజీలు ఏర్పాటు చేయాలని కోరారు.

● రుద్రవరం సచివాలయం-1లో మేడపైన ఉపాధి హామీ పథకం గ్రామసభను మంగళవారం నిర్వహించారు. గ్రామసభ మేడపైన ఎలా నిర్వహిస్తారని టీడీపీ నాయకుడు ఎల్‌వీ రంగనాయకులు, ఉపాధి పథకం అధికారులను ప్రశ్నించారు. కూర్చోవడానికి కూడా కుర్చీలు లేవు అని అన్నారు. సమస్యలు సమస్యలు విన్నవించుకునేందుకు వచ్చిన వృద్ధులు, మహిళలు ఇబ్బంది పడ్డారన్నారు. ఈ విషయంపై ఈవో సుబ్బారావు మాట్లాడుతూ మేడపైన గ్రామసభ నిర్వహించింది వాస్తవమేనని. మరోసారి గ్రామసభను మేడపై నిర్వహించమని ఈవో తెలిపారు.

ఆదర్శ పాఠశాల తనిఖీ


ఆదర్శపాఠశాల వసతిగృహంలో మంచాలను పరిశీలిస్తున్న తహసీల్దారు

రుద్రవరం, ఆగస్టు 27 : ఆదర్శపాఠశాల వసతిగృహాన్ని మంగళవారం తహసీల్దారు మల్లికార్జునరావు తనిఖీ చేశారు. విద్యార్థినులకు నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. 50 మంచాల బెడ్లు సరిగా లేవన్నారు. వసతిగృహం పాఠశాలకు ప్రహరీగోడ నిర్మించాలని విద్యార్థినులు కోరారు. ఆయన వెంట ఈవోపీఆర్‌డి శ్రీనివాసశర్మ తదితరులు ఉన్నారు.

● రుద్రవరం కస్తూర్బాగాంధీ గురుకుల విద్యాలయాన్ని మండల ప్రత్యేక అధికారి మంగళవారం తనిఖీ చేశారు. పాఠశాలలో వంట గదిని పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా, లేదా అని అడిగారు. కార్యక్రమంలో ఎంపీడీవో మధుసూదన్‌రెడ్డి, ప్రిన్సిపాల్ లక్ష్మిదేవి, ఏఈ వెంకటరాముడు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల సమస్యలపై నివేదిక పంపుతాం

- తహసీల్దారు శ్రీనివాసులు


పాఠశాల సమస్యలను తహసీల్దారుకు వివరిస్తున్న ఎస్‌వో అంజనమ్మ

ఉయ్యాలవాడ, ఆగస్టు 27: పాఠశాల సమస్యలపై నివేదిక పంపుతామని తహసీల్దారు శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం పుచ్చకాయపల్లెలోని కస్తూర్బా బాలికల పాఠశాలను తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ పాఠశాలలో 252 మంది విద్యార్థులు ఉండగా వారికి తగ్గ గదులు లేవన్నారు. పాఠశాలలో డ్రైనేజీ సమస్య ఉన్నట్లు గుర్తించామన్నారు. విద్యార్థులకు ఆటస్థలం లేదని తెలిపారన్నారు. వీటిపై నివేదికలు తయారు చేసి ఉన్నతాధికారులకు పంపుతామని తహసీల్దారు తెలిపారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ మహింధర్‌రెడ్డి, పాఠశాల ఎస్‌వో అంజనమ్మ ఉన్నారు.

గూడాల మురళీధర్‌రెడ్డికి మాతృ వియోగం


నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే బిజ్జం పార్థసారధిరెడ్డి

అవుకు, ఆగస్టు 27: అవుకు మండలం కునుకుంట్ల గ్రామ టీడీపీ నాయకుడు గూడాల మురళీధర్‌రెడ్డి మాతృమూర్తి గూడాల నాగలక్ష్మమ్మ (75) మంగళవారం మృతి చెందారు. పాణ్యం మాజీ ఎమ్మెల్యే బిజ్జం పార్థసారధిరెడ్డి, టీడీపీ సీనియర్ నాయకుడు ఐవి పక్కీరరెడ్డి, రాష్ట్ర రోడ్లు భవనాలు శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి సతీమణి బీసీ ఇందిరమ్మ, నంద్యాల మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిశోర్‌రెడ్డి, చల్లా సూర్యప్రకాష్‌రెడ్డి, ఎంపీపీ చల్లా రాజశేఖర్‌రెడ్డి, చల్లా విజయభాస్కర్‌రెడ్డి, చల్లా విఘ్నేశ్వరరెడ్డి, చల్లా ప్రభాకర్‌రెడ్డి, కాట్రెడ్డి మల్లికార్జునరెడ్డి, మారం భాస్కర్‌రెడ్డి, పులి ప్రకాష్‌రెడ్డి, బొల్లపు బాలిరెడ్డి, ఆకుల నాగిరెడ్డి, ఇస్మాయిల్‌ఖాన్ కునుకుంట్ల గ్రామానికి చేరుకొని నాగలక్ష్మమ్మ పార్థీవదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

గణేశ్ ఉత్సవాలు శాంతియుతంగా నిర్వహించుకుందాం


నిమజ్జనం చేసే ప్రాంతాన్ని పరిశీలిస్తున్నఉత్సవ కమిటీ అధ్యక్షుడు మల్లారెడ్డి, టంగుటూరు శ్రీనయ్య తదితరులు

బనగానపల్లె, ఆగస్టు 27: గణేశ్ ఉత్సవాలను బనగానపల్లె పట్టణంతో పాటు గ్రామాల్లో శాంతియుతంగా జరుపుకుందామని బనగానపల్లె పట్టణ గణేశ్ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు మల్లారెడ్డి, గౌరవసలహాదారు టంగుటూరు శ్రీనయ్య అన్నారు. మంగళవారం బనగానపల్లె పట్టణంలో విగ్రహాలను నిమజ్జనం చేసే చెరువు గట్టును పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో సెప్టెంబరు 7న గణేశ్ విగ్రహాలను ప్రతిష్ఠించుకొని, మూడు రోజుల పూజల అనంతరం 9వతేదీ సోమవారం గణేశ్ నిమజ్జనం సమీప చెర్వుల్లో నిమజ్జనం చేయాలని కోరారు. బనగానపల్లె పట్టణంలో 5 రోజుల పూజల అనంతరం 11వతేదీ క్రైప చెర్వులో నిమజ్జనం చేయనున్నట్లు వారు తెలిపారు.

104 సేవలు వినియోగించుకోండి

ఉయ్యాలవాడ, ఆగస్టు 27: 104 సేవలు ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని ఉయ్యాలవాడ పాథమిక వైద్యశాల వైద్యాధికారి వెంకటసుబ్బయ్య తెలిపారు. మంగళవారం తుడుమలదిన్నె గ్రామంలో వైద్యసేవలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి నెల మండలంలోని అన్ని గ్రామాల్లో 104 సేవలు అందిస్తున్నామన్నారు. తుడుమలదిన్నెలో 1540 మంది బీపీ, సుగరు, తదితర వ్యాధులతో బాధపడుతున్న వారికి పరీక్షలు జరిపి మందులు పంపిణీ చేశామన్నారు. అలాగే గ్రామంలోని ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి విద్యార్థులు వైద్యపరీక్షలు జరిపినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిసెంట్లు క్రిష్ణ, ఏఎన్‌యంలు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

సంజామల, ఆగస్టు 27: సీజనల్ వ్యాధులపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని హెల్త్ ఎడ్యూకేటర్ నారాయణదాసు అన్నారు. మంగళవారం కమలపురి ఉన్నత పాఠశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈగలు, దోమల ద్వారా సోకే మలేరియా, చికెన్ గున్యా, ఫైలేరియా , మెదడువాపు వ్యాధులు, వాంతులు, విరేచనాలు వ్యాపిస్తాయన్నారు. ప్రతి శుక్రవారం ఇండ్లలో డ్రైడే పాటించాలని, ఇండ్లలోని తొట్లు, డ్రమ్ములు, బాణలో నీటిని పారబోసి ఆరబెట్టాలన్నారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో జల్బు, జ్వరం, కీళ్ల నొప్పులు, తలనొప్పి ఎటువంటి అనారోగ్యానికి గురైనా వెంటనే స్థానిక పి.హెచ్.సిలో వైద్యం చేయించుకోవాలన్నారు.

బీసీ హాస్టల్ తనిఖీ

సంజామల, ఆగస్టు 27: సంజామల బీసీ బాలుర వసతి గృహాన్ని తహసీల్దార్ అనిల్ కుమార్, ఎంపీడీవో విజయ్ కుమార్ రెడ్డి మంగళవారం తనిఖీ చేశారు. వసతి గృహంలో ప్రహరీ, మురుగు నీరు వెళ్లే కాల్వలు, ఫ్యాన్‌లు లేవని సంక్షేమ అధికారి మునిరాజు తహసీల్దార్, ఎంపీడీవోలకు తెలియజేశారు. సమస్యలపై ప్రభుత్వానికి నివేదిక పంపుతామని తెలిపారు.

కార్మికులకు అండగా టీడీపీ

బేతంచెర్ల, ఆగస్టు 27: రాష్ట్రంలో టీడీపీ ఎస్సీ, ఎస్టీ కార్మిక కర్షకులకు అండగా నిలుస్తుందని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, టీడీపీ రాష్ట్ర క్రిస్టియన్ సెల్ అధ్యక్షుడు ఈటె స్వామి దాసు అన్నారు. మంగళవారం మంగళగిరి టీడీపీ కార్యాలయంలో టీడీపీ రాష్ట్ర క్రిస్టియన్ సెల్ అధ్యక్షుడు ఈటె స్వామిదాసు, క్రిస్టియన్ సెల్ రాష్ట్ర కార్యదర్శి మేకల నాగరాజు, జిల్లా అధికార ప్రతినిధి పిడతల రూబెన్‌లను మంత్రి సుభాష్ సన్మానించారు.

గణేష్ ఉత్సవాలకు ఐదు రోజుల అనుమతి


డోన్ డీఎస్పీని కలిసి వినతి పత్రం అందజేస్తున్న గణేష్ మహోత్సవ కేంద్ర సమితి సభ్యులు

డోన్(రూరల్), ఆగస్టు 27: గత 8 సంవత్సరాలుగా గణేష్ ఉత్సవాలు డోన్ పట్టణ ప్రాంతంలో మూడు రోజులకు మాత్రమే పోలీసులు అనుమతులు ఇస్తూ వస్తున్నారు. అయితే ఈ ఏడాది సెప్టెంబరు 7 నుంచి జరిగే వినాయక చవితి ఉత్సవాలు 3 నుంచి 5 రోజుల వరకు జరుపుకునేందుకు డోన్ డీఎస్పీ పి.శ్రీనివాసులు సానుకూలంగా స్పందించారు. మంగళవారం గణేష్ మహోత్సవ కేంద్ర సమితి అధ్యక్షులు కేవీ ఫణిరాజ్, కార్యనిర్వాహక అధ్యక్షులు సంధు వెంకటరమణ, జనరల్ సెక్రటరీ హనుమంతరెడ్డి, సభ్యులు కలిసి డోన్ డీఎస్పీ శ్రీనివాసులును కలిసి వినతి పత్రం అందజేశారు.డోన్ డీఎస్పీ వీటిపై సానుకూలంగా స్పందించడంతో వారు హర్షం వ్యక్తం చేశారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

ప్యాపిలి, ఆగస్టు 27: ట్రాఫిక్ నిబంధనలు తప్పక పాటించాలని సీఐ వెంకటరామిరెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో ఆటో డ్రైవర్లతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ అతివేగంతో రోడ్డు ప్రమాదాలు జరుగుతాయని, వేగాన్ని నియంత్రించాలని సూచించారు. అలాగే ఆటోలో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించరాదన్నారు. ప్రతి డ్రైవర్ లైసెన్స్ కలిగి ఉండాలని, సకాలంలో టాక్స్‌లు చెల్లించాలని సీఐ సూచించారు.

90 రోజుల పనిదినాలపై అవగాహన

చాగలమర్రి, ఆగస్టు 27: చాగలమర్రి గ్రామంలోని లేఔట్‌ల పరిధిలో గృహాలు నిర్మించుకుంటున్న లబ్ధిదారులకు 90 రోజుల పనిదినాలపై హౌసింగ్ ఏఈ షఫివుల్లా, ఏపీవో నిర్మల మంగళవారం అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ 5 లేఔట్‌లలో గృహాలు నిర్మించుకోని లబ్ధిదారులకు గృహాలు నిర్మించుకోవాలని, బేస్‌మెంట్ పనులకు 90 రోజుల పనిదినాలు నిధులు వారి ఖాతాల్లో జమ అవుతాయని అన్నారు. 1,500 గృహాలకు ఇంటింటి సర్వే పూర్తి చేశామని అన్నారు. గృహాలు మంజూరైన లబ్ధిదారులు బేస్‌మెంట్ పనులు పూర్తి చేయాలని కోరారు.

హత్యాచార నిందితులను కఠినంగా శిక్షించాలి



రంగాపురంలో ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

బేతంచెర్ల, ఆగస్టు 27: కోల్‌కత్తాలో వైద్య విద్యార్థిని అత్యాచారం చేసి హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం ఆర్ఎస్ రంగాపురంలో విద్యార్థులతో కలిసి ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ సంఘాల నాయకులు భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు ఉదయ్ కుమార్ ప్రభుత్వ వైద్యాధికారి డా.ఆలీమ్, నాయకులు ప్రదీప్, బాస్కర్, రమేష్, ఇద్రుస్‌బాషా, స్టాఫ్ నర్సు అనురాధ, హెల్త్ సూపర్‌వైజర్ రాజ్యలక్ష్మి, ఆశాలు లక్ష్మీదేవి, నాగమ్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

డీఎస్పీని కలిసిన మున్సిపల్ చైర్మన్

డోన్, ఆగస్టు 27 : డోన్ డీఎస్పీ శ్రీనివాసులును మంగళవారం మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ మర్యాదపూర్వకంగా కలిశారు. పట్టణంలోని డీఎస్పీ కార్యాలయంలో డీఎస్పీ శ్రీనివాసులును కలిసి పూలబొకేను అందజేసి మున్సిపల్ చైర్మన్ అభినందనలు తెలిపారు. అదే విధంగా పలువురు టీడీపీ నాయకులు డీఎస్పీ శ్రీనివాసులును మర్యాదపూర్వకంగా కలిశారు.

ఉద్యానవన పంటలు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలి

కొలిమిగుండ్ల, ఆగస్టు 27 : ఉద్యానవన పంటలను సాగు చేసిన రైతులు తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో పంట నమోదు చేసుకోవాలని కోవెలకుంట్ల వ్యవసాయ సబ్ డివిజన్ ఉద్యానవన శాఖ అధికారి ధరణి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని అబ్దులాపురం, ఎస్.చెన్నంపల్లె, కొలిమిగుండ్ల తదితర గ్రామాల్లో పర్యటించి, పండ్ల తోటలు, పూల తోటలు, కూరగాయాలు తదితర ఉద్యానవన పంటల నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. పంటలు సాగు చేసిన ప్రతి రైతు ఆయా గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాలను సంప్రదించి పంట నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో విహెచ్ఎ శ్రీధర్, రైతులు పాల్గొన్నారు.

ఎస్టీ కేసులపై అవగాహన కల్పించాలి

డోన్(రూరల్), ఆగస్టు 27: ఎస్టీ కేసులపై అవగాహన కల్పించాలని ఏపీ గిరిజన సమైక్య జిల్లా ప్రధాన కార్యదర్శి మోటరాముడు, ఏపీ ఎరుకుల హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షులు మేడసారి గోపాల్, పట్టణ అధ్యక్షులు రామయ్య, తదితరులు కోరారు. మంగళవారం డోన్ డీఎస్పీ శ్రీనివాసులును మర్యాదపూర్వకంగా కలిసి శాలువలతో సత్కరించారు. వారు మాట్లాడారు. కార్యక్రమంలో ఎన్‌టీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేశ్, కొత్త రాయుడు తదితరులు పాల్గొన్నారు.

చెంచుల జీవనాభివృద్ధే లక్ష్యం

చాగలమర్రి, ఆగస్టు 27: చెంచుగూడెల్లో నివసిస్తున్న చెంచుల జీవనాభివృద్ధి పీఎం జన్‌మన్ లక్ష్యమని హెల్త్ ఎడ్యూకేటర్ వెంకటమ్మ తెలిపారు. మంగళవారం చాగలమర్రి గ్రామంలోని చాగలమ్మ చెంచు కాలనీలో ఎంపీడీవో మహబూబ్‌దౌల ఆధ్వర్యంలో మండలస్థాయి అధికారులచే పీఎం జన్‌మన్ కార్యక్రమంపై చెంచులకు అవగాహన కల్పించారు. ఉపాధిహామీ, పక్కా ఇళ్లు, మంచి నీటి కొళాయి, రహదారులు, విద్యుత్, విద్య, వైద్యం, పౌష్టికాహారం, జీవనోపాదులపై ఆ శాఖల అధికారులు చెంచులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ తాహిర్‌హుస్సేన్, ఎంఈవో అనూరాధ, ఏఈలు షాజహాన్, షఫివుల్లా, కొండారెడ్డి, ఏపీవో నిర్మల, సూపర్‌వైజర్ రామలింగారెడ్డి, మండల కో-ఆర్డినేటర్ రాజ్‌కుమార్, సచివాలయ ఉద్యోగులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ


మండల వ్యవసాయ, సహాయ సంచాలకులకు శిక్షణ ఇస్తున్న జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ

బనగానపల్లె , ఆగస్టు 27: బనగానపల్లె మండలం యాగంటిపల్లె కృషి విజ్ఞానకేంద్రంలో జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ ఆధ్వర్యంలో మండల వ్యవసాయాధికారిరు, సహాయ సంచాలకులకు శిక్షణ తరగతులు మంగళవారం నిర్వహించారు. జిల్లా వ్యవసాయాధికారి మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంలోని మెళకువలు, వాటిని ఏ విధంగా ఆచరణలో పెట్టాలి వాటి అవశ్యకతను గురించి కెవికె సీనియర్ సైంటిస్టు ధనలక్ష్మి, సైంటిస్టు బాలరాజు వివరించారు. కార్యక్రమంలో జిల్లా ప్రాజెక్టు మేనేజర్ నేరేంద్రారెడ్డి, 28 మండలాల వ్యవసాయాధికారులు, ఆరు డివిజన్ల సహాయవ్యవసాయ సంచాలకులు, జిల్లా వనరుల కేంద్ర ఉపసంచాలకురాలు సరళమ్మ, కేవీకే సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.